ANN తెలుగు
Follow: @ANNTELUGU
03-07-2025
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 209 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## సామాన్యులకు సాయం చేయాలన్న తపనే ఈ స్థాయి కల్పించింది

### ఎఎన్ఎన్ - మహాతో మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, మహా :** సామాన్యులకు సాయం చేయాలన్న తపనే తనను మంత్రి స్థాయికి తెచ్చిందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖా మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఎఎన్ఎన్ మహా తో బుధవారం ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ఎన్నో దెబ్బలు తిని తాను ఎదిగానని, వెనుకబడ్డ జాతులు ఇతరుల కంటే ఎక్కువగా కష్టపడాల్సి వస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ కట్టినవేనని, బిఆర్ఎస్ కట్టిన ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందన్నారు. జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ అన్నీ కాంగ్రెస్ కట్టినవేనన్నారు. నీళ్ళిచ్చే ప్రతి ప్రాజెక్టు కాంగ్రెస్ కట్టిందేనన్నారు. రైతుల కోసం కాంగ్రెస్ చేసినంత ఎవరూ చేయలేదన్నారు. 22వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత రేవంత్ ప్రభుత్వానిదేనని, 9రోజుల్లో 9వేల కోట్ల రైతు భరోసాను అందించి ప్రభుత్వం రికార్డు క్రియేట్ చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో సంక్షేమ ప్రభుత్వం నడుస్తున్నదని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ లతో సీనియర్ల ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేసుకుంటున్నామన్నారు. మల్లిఖార్జున ఖర్గే తెలంగాణ పర్యటనకు వస్తుండడం హర్షదాయకమన్నారు.

**టాప్ న్యూస్**

## ఐదేళ్లపాటు సీఎం నేనే

- సీఎం మార్పు ప్రచారానికి సిద్ధరామయ్య చెక్
- అది బీజేపీ, జేడీఎస్ చేస్తున్న ఫేక్ ప్రచారమని ఫైర్
- ముఖ్యమంత్రిని చేయాలని ఎవరిని అడగలేదు: డీకే
- ఆయనకు అండగా ఉండటం తప్ప ఇంకో ఆప్షన్ లేదని వెల్లడి



02

## తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు

- ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్డు కాంట్రాక్టులు చూసేది వారే
- ఆ కోవర్టులకు కరెంట్, నల్లా కనెక్షన్ కట్ చేయండి
- బనకచర్ల ఆపడానికి లేఖలు రాస్తే సరిపోదు.. ఉత్తమ్ అన్న
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన కామెంట్స్



02

## దమ్ముంటే అసెంబ్లీ పెట్టు

- బనకచర్లపై నీ అబద్దాల చిట్టా విప్పుతా
- సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు ఛాలెంజ్
- మాట్లాడేటపుడు మైక్ కట్ చేయకూడదని కండీషన్
- ప్రజెంటేషన్‌కు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను ఎందుకు పిలువలేదు?
- ఆ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా చంద్రబాబు ఇచ్చిందే



03

# ట్యాపింగ్‌లో సంచలనం



### రేవంత్ సహా కాంగ్రెస్ నేతలతో మాట్లాడిన కాల్స్ ట్యాప్

### దర్యాప్తులో ఆడియోలు విని ఖంగుతిన్న ఆరా మస్తాన్

తెలంగాణ, ఏపీ లీడర్లతో మాట్లాడిన కాల్స్ ట్యాప్ చేసిన ప్రభాకర్ రావు టీం

రెండుగంటల పాటు విచారించిన సిట్ అధికారులు

*తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో విచారణ కొనసాగుతోంది. ఆ క్రమంలో పలు కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా పొలిటికల్ స్ట్రాటజిస్ట్ ఆరా మస్తాన్ ఫోన్ సైతం ట్యాప్ అయినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. దీంతో అతడిని సైతం దర్యాప్తు అధికారులు బుధవారం కార్యాలయానికి పిలిపించి విచారించారు. ఈ సందర్భంగా ఎన్నికలు, ఉప ఎన్నికల సమయంలో.. కాంగ్రెస్ పార్టీ నేతలతో ఆరా మస్తాన్ మాట్లాడిన ఫోన్ కాల్స్‌ను దర్యాప్తు అధికారులు వినిపించారు. వీటిని విన్న ఆరా మస్తాన్ షాక్‌కు గురైనట్లు తెలుస్తుంది. 2023 నవంబర్‌లో అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, కొండల్ రెడ్డితోపాటు చామల కిరణ్ కుమార్ రెడ్డితో ఆరా మస్తాన్ పలు సందర్భాల్లో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డితో మాట్లాడిన కాల్స్‌ను ప్రభాకర్ రావు టీమ్ ట్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. ఇక 2023 సెప్టెంబర్ నుండి ఆరా మస్తాన్ ఫోన్ ట్యాప్ అయినట్లు ఈ దర్యాప్తు అధికారులు గుర్తించారు. అలాగే ఏపీకి చెందిన పలువురు పొలిటికల్ లీడర్లు, వారి అనుచరులతో సైతం ఆరా మస్తాన్ మాట్లాడిన ఫోన్ కాల్స్‌ను ప్రభాకర్ రావు టీమ్ ట్యాప్ చేసినట్లు గుర్తించారు.*

- మహా, హైదరాబాద్

03



## ప్రతిష్టాత్మకంగా ఖర్గే సమావేశం

### కాంగ్రెస్ మూల సిద్దాంతాలు గ్రామస్థాయికి..

### ఎఎన్ఎన్-మహాతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ పార్టీ మూల సిద్దాంతాలు, భావజాలాన్ని కాంగ్రెస్ కార్యకర్తల్లోకి బలంగా తీసుకెళ్ళేందుకు ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఈనెల 4వ తేదీన వస్తున్నారని ఈ సభ కాంగ్రెస్ పార్టీ అత్యంత ముఖ్యమైనదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం ఎఎన్ఎన్ మహా తో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, కాంగ్రెస్ భావజాలం గ్రామస్థాయి కార్యకర్తలకు వివరించేందుకు 15వేల మంది గ్రామశాఖల అధ్యక్షులతో ఎల్బీస్టేడియం సమావేశం ఏర్పాటుచేశామన్నారు. పథకాలు ప్రజలకు అందకూడదని బిఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఇది కాంగ్రెస్ పండుగ- మంత్రి పొన్నం

ఊరూరా ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త హైదరాబాద్ సభకు తరలిరావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎఎన్ఎన్ మహా తో మంత్రి ప్రత్యేకంగా మాట్లాడుతూ జైబాపు జై భీమ్ జై సంవిధాన్ అంటూ రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పాటుపడుతున్నదన్నారు. మల్లిఖార్జున్ ఖర్గే సభ జయప్రదానికి అందరూ కలిసిరావాలన్నారు.



## భూ సమీకరణకు కొత్త చట్టం

- సరికొత్త నిబంధనలతో రూపకల్పన
- మార్గదర్శకాలకు త్వరలోనే ప్రతిపాదనలు
- విస్తరిత హెచ్ఎండీఏ పరిధిలో అమలు

03

## శివ బాలకృష్ణ ఇంట్లో ఈడీ సోదాలు

- రాజేంద్ర నగర్, చైతన్యపురిలోని నివాసాల్లో సోదాలు
- పలు పత్రాలు స్వాధీనం చేసుకున్న ఈడీ అధికారులు
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గతంలో ఆయన అరెస్టు
- హెచ్ఎండీఏ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో అవినీతికి పాల్పడినట్లు అభియోగాలు
- శివ బాలకృష్ణకు సంబంధించిన రూ. 250 కోట్ల విలువైన ఆస్తులు సీజ్

02



## విచారణకు రండి..

- అరవింద్ కుమార్‌కు మళ్లీ పిలుపు
- నేడు ఇన్వెస్టిగేషన్‌కు రావాలని ఏసీబీ నోటీసులు
- ఇప్పటికే మూడుసార్లు విచారణకు.. తాజాగా నాలుగో సారి నోటీసులు



వివరాలు 2లో



## రాష్ట్రంలో యూరియా కొరత

- సరిపడేంత ఎరువులు సరఫరా చేయాలి
- కేంద్ర ప్రభుత్వం అలసత్వంతో రైతులకు ఇబ్బందులు
- కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఈ విషయంలో చొరవ తీసుకోవాలి
- కేంద్ర మంత్రులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ

02

## ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్ పూర్తి చేయాలి

### 9-12 తరగతుల విధానంపై అధ్యయనం చేయండి

- కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు సాధించాలి
- యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రగతిపై నివేదిక ఇవ్వండి
- విద్యా శాఖ సమీక్షలో సీఎం ఏ.రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పదో తరగతిలో పెద్ద సంఖ్యలో ఉత్తీర్ణత కనిపిస్తోందని ఇంటర్మీడియట్ పూర్తయ్యే సరికి ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోవడానికి గల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

మిగతా 2లో



## ఏడాదికి ఒక నెల డాక్టర్లు ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేయాలి

వివరాలు 3లో




kandisrinivasareddy kandisrinivasareddy kandisrinivasareddy

# దమ్ముంటే అసెంబ్లీ పెట్టు

## బనకచర్లపై నీ అబద్ధాల చిట్టా విప్పుతా

- సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు ఛాలెంజ్
- మాట్లాడేటపుడు మైక్ కట్ చేయకూడదని కండీషన్
- ప్రజెంటేషన్‌కు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను ఎందుకు పిలువలేదు?
- ఆ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా చంద్రబాబు ఇచ్చిందే



**హైదరాబాద్, మహా:** బనకచర్ల అంశంపై సీఎం రేవంత్ చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలు అని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. బేసిన్ల గురించి సీఎంకు మినిమం అవగాహన లేదని మండిపడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నో ప్రాజెక్టులను అడ్డుకున్నారని, అవన్నీ ప్రజంటేషన్‌లో ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. తమ పార్టీ సచ్చిన పామే అయితే.. పదే పదే బీఆర్ఎస్ పేరెందుకు ప్రస్తావిస్తున్నారన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బనకచర్ల ప్రాజెక్టు ఎవరి హయాంలో ఏపీకి వెళ్లిందో వివరిస్తూ, సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు ఓపెన్ ఛాలెంజ్ చేశారు. రేవంత్‌కు దమ్ముంటే అసెంబ్లీ సమావేశం నిర్వహించి.. బనకచర్ల ప్రాజెక్టుపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. బనకచర్లపై చర్చించేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని, రేవంత్ బండారమంతా అసెంబ్లీ సాక్షిగా బయటపెడతామని తెలిపారు. కానీ.. బనకచర్లపై మాట్లాడేటపుడు మైక్ కట్ చేయకూడదని కండీషన్ పెట్టారు. ప్రగతి భవన్ లో నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. బనకచర్లను కేసీఆరే యాక్సెప్ట్ చేశారని కాంగ్రెస్ చెబుతున్నదానిలో నిజం లేదన్నారు.

**ప్రజెంటేషన్ కూడా చంద్రబాబు ఇచ్చిందే**

రాజ్యాంగ పదవిలో ఉన్న మన సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజకీయాలు కేంద్రంగా బురద జల్లడమే పనిగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రగతి భవన్‌లో పెట్టిన ప్రజంటేషన్ అమరావతిలో తయారు చేసినట్లుగా ఉందని రేవంత్ కు చురకలంటించారు. చంద్రబాబు తరుపున రేవంత్ రెడ్డి ప్రజంటేషన్ ఇచ్చినట్లుగా ఉందంటూ ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు ఎన్నో తెలంగాణ ప్రాజెక్టులను చంద్రబాబు ఆపే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. బనకచర్ల మీద బొంకుడు రాజకీయాలు పక్కన పెట్టకుంటే ప్రజలు అదఃపాతాళానికి తొక్కుతారని హరీశ్ రావు హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ గతంలో 'చంద్రబాబుతో ఉన్న అనుబంధం మరిచిపోలేకపోతున్నారనన్నారు. . గత సంవత్సరం జులై 6న చం ద్రబాబును ప్రజా భవన్‌కు పిలిచారని, . ఆరోజే బనకచర్లకు పునాది పడిందని అన్నారు. 2024 సెప్టెంబర్ 13 బెజవాడ వెళ్లి.. బజ్జీలు తిని ఉత్తమ్ కుమార్ రెడ్డి బనకచర్లకు లైన్ క్లియర్ చేశారని ఆరోపించారు.

**దమ్ముంటే అసెంబ్లీలో చర్చ పెట్టు..**

నవంబర్, డిసెంబర్ నెలల్లో నిర్మలా సీతారామన్‌కు బనకచర్ల ప్రాజెక్ట్ కోసం డబ్బులు ఇవ్వమని చంద్రబాబు లేఖలు రాశారన్నారు. అపెక్స్ లేఖలో లేని విషయాలు చెబుతున్నారని, అందులో రెండు రాష్ట్రాలు కూర్చొని మాట్లాడుకుందాం అని ఉందని తెలిపారు హరీశ్ రావు. ఆమోదయోగ్యమైన మీటింగ్ ఏపీ ప్రభుత్వంతో జరుగలేదని అంటూ తమ పాలనలో బనకచర్లపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని స్పష్టం చేశారు.. 2016లో బనక చర్ల రాసి ఇచ్చాము అని తప్పుడు మాటలు చెబుతున్నారని రేవంత్‌పై విరుచుకుపడ్డారు.. ఈ మీటింగ్ మినిట్స్‌లో పెన్నా నది పేరు ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు, దమ్ముంటే అసెంబ్లీలో చర్చ పెట్టు నీ బట్టలు విప్పుతాం' అంటూ హరీశ్ రావు సవాల్ విసిరారు.

# ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్ పూర్తి చేయాలి...

## 9-12 తరగతుల విధానంపై అధ్యయనం చేయండి

- కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు సాధించాలి
- యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రగతిపై నివేదిక ఇవ్వండి
- విద్యా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి...



(మొదటిపేజీ తరువాయి)

విద్యా శాఖపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ కీలకమైనందున.. ఆ దశలో విద్యార్థికి సరైన మార్గదర్శకత్వం లభించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాల్లో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉంటుందని.. అక్కడ డ్రాపౌట్స్ సంఖ్య తక్కువగా ఉందని అధికారులు సీఎంకు తెలియజేశారు. ఇంటర్మీడియట్ వేరుగా 12వ తరగతి వరకు పాఠశాలలు ఉన్న రాష్ట్రాల్లో అధికారులు అధ్యయనం చేసి ఈ విధానంపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ విషయంలో విద్యా కమిషన్, ఆ విభాగంలో పని చేసే ఎన్జీవోలు, పౌర సమాజం సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్ విద్య మెరుగుకు అన్ని దశల్లో చర్చించి శాసనసభలోనూ చర్చకు పెడతామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇంటర్మీడియట్‌లో విద్యార్థుల చేరికతో పాటు వారి హాజరుపైనా దృష్టిపెట్టాలన్నారు.

యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ స్కూళ్ల నమూనాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్రతి పాఠశాల ఆవరణలో భారీ జాతీయ జెండా ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. పాఠశాలల నిర్మాణం ప్రక్రియను వేగవంతం చేయాలని , నిర్మాణాల ప్రగతిపై ప్రతి వారం తనకు నివేదిక సమర్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ స్కూళ్ల నిర్మాణాలను చేపడతామన్నారు. ఇప్పటికే ఒక్కో పాఠశాలకు సంబంధించి స్థల సేకరణ పూర్తయినందున, రెండో పాఠశాలకు సంబంధించిన స్థల గుర్తింపు, సేకరణ ప్రక్రియపై దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం నిర్మాణ నమూనాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. పలు మార్పులను సూచించారు. సాధ్యమైనంత త్వరగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిత, జేఎన్టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# విచారణకు రండి

- అరవింద్ కుమార్‌కు మళ్లీ పిలుపు
- నేడు ఇన్వెస్టిగేషన్‌కు రావాలని ఏసీబీ నోటీసులు
- ఇప్పటికే మూడుసార్ల విచారణకు.. తాజాగా నాలుగో సారి నోటీసులు

**హైదరాబాద్, మహా:** ఫార్ములాఈ కార్ రేస్ కేసు లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీనియర్ అధికారి అరవింద్ కుమార్‌కు ఏసీబీ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. నేడు ఉదయం 11:30 గంటలకు విచారణకు హాజరు కావాలని బుధవారం మళ్లీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే అరవింద్ కుమార్‌ను మూడుసార్లు విచారించగా, ఇది నాలుగోసారి కావడం విశేషం.

**రూ.55 కోట్లు దుర్వినియోగం..**

కాగా, బీఆర్ఎస్ హయాంలో ఫార్ములా ఈ కార్ రేస్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ రేస్ నిర్వహణ సంస్థకు హెచ్ఎండీఏ చెల్లింపులు జరిపింది. అయితే ఆర్బీఐ నిబంధనలు ఉల్లంఘించి విదేశీ కంపెనీకి నగదు బదిలీ అయిందని.. దాదాపు రూ.55 కోట్లు దుర్వినియోగం జరిగినట్లు ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముగ్గురిపై ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు.



# ఈ నెల 21 నుంచి పార్లమెంట్ సమావేశాలు

- ఆగస్టు 21 వరకు వర్షా కాల సెషన్
- పలు బిల్లులకు ఆమోదం తెలిపే అవకాశం
- ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సింధూర్ పై కూడా వాడీ వేడీ చర్చ

**ఢిల్లీ, మహా:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తేదీలు ఖరారు అయ్యాయి. 2025, జూలై 21 నుంచి 2025, ఆగస్ట్ 21 వరకు పార్లమెంట్ మూన్‌సూన్ సెషన్ జరగనుంది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బుధవారం (జూలై 2) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సన్నాహాలు, మెరుగైన భద్రతా చర్యల కారణంగా ఆగస్టు 13, 14 తేదీల్లో సమావేశాలు ఉండవని వెల్లడించింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. వర్షకాల లోక్‌సభ, రాజ్యసభ సమావేశాల నిర్వహణకు భారత రాష్ట్రపతి ఆమోదం తెలిపారని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఆగస్టు 13, 14 న ఉభయ సభలకు సెలవు.. 2025 జులై 21 నుంచి 2025, ఆగస్టు 21వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతాయని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల దృష్ట్యా ఆగస్టు 13, 14 తేదీలలో ఉభయ సభలకు సెలవు ఉంటుందని చెప్పారు.పహల్గామ్ ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సింధూర్ తర్వాత జరగబోతున్న మొదటి పార్లమెంట్ సమావేశాలు ఇవే. పహల్గామ్ ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సింధూర్ గురించి చర్చించేందుకు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ అంశాలపై వాడీ వేడీగా చర్చ జరిగే అవకాశం ఉంది.

# శివ బాలకృష్ణ ఇంట్లో ఈడీ సోదాలు

- రాజేంద్ర నగర్, చైతన్యపురిలోని నివాసాల్లో సోదాలు
- పలు పత్రాలు స్వాధీనం చేసుకున్న ఈడీ అధికారులు
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గతంలో ఆయన అరెస్టు
- హెచ్ఎండీఏ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో అవినీతికి పాల్పడినట్లు అభియోగాలు
- శివ బాలకృష్ణకు సంబంధించిన రూ. 250 కోట్ల విలువైన ఆస్తులు సీజ్



ఆదాయానికి మించి ఆస్తులు..

**హైదరాబాద్, మహా:** హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ ఇంట్లో ఈడీ సోదాలు నిర్వహించింది. అతని సోదరుడి ఇంట్లో కూడా ఎన్‌ఫోర్స్ డైరెక్టరేట్ అధికారులు తనిఖీలు చేశారు. ఆదాయనికి మించి ఆస్తుల కేసులో శివబాలకృష్ణ అరెస్ట్ అయ్యారు. ఆయన తన పదవిని అడ్డుపెట్టుకుని రూ. వందల కోట్లు సంపాధించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.హెచ్ఎండీఏ, రేరా, మెట్రోలో జరిగిన అక్రమాలకు సంబంధించిన కేసులో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) విచారణ ఎదుర్కొంటున్న శివబాల కృష్ణపై హైదరాబాద్ మెట్రో పాలిటన్ అథారిటీ వేటు వేసింది. శివ బాలకృష్ణను 2024 జనవరిలో సస్పెండ్ చేస్తూ హెచ్ఎండీఏ కమిషనర్ దాన కిషోర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. శివ బాలకృష్ణకు రూ.250 కోట్ల మేర ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు గతంలో ఏసీబీ దాడుల్లో గుర్తించింది. 200 ఎకరాల వ్యవసాయ భూమితో పాటు ఇంటి స్థలాలు, విల్లా తదితర ఆస్తులు గుర్తించిన ఏసీబీ వీటి విలువ బహిరంగ మార్కెట్ లో రూ.250 కోట్లుంటుందని అంచనా వేసింది. ఇప్పటికే శివ బాలకృష్ణ అతని సోదరుడు నవీన్‌ను అనిశా అరెస్టు చేసింది. తాజాగా ఈడీ నిర్వహించిన దాడుల్లో శివ బాలకృష్ణ అతని సోదరుడు నవీన్ కుమార్ నివాసాల్లో పలు దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు. శివబాలకృష్ణ అడ్డదారుల్లో సంపాదించిన ఆస్తులకు బినామీలుగా వ్యవహరించిన ఆయన సమీప బంధువులైన ముగ్గురిని అవినీతి నిరోధక శాఖ అధికారులు ఇప్పటికే అరెస్టు చేశారు. తాజాగా శివ బాలకృష్ణ అతడి సోదరుడి నివాసాల్లో ఈడీ సోదాలు నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలోనే శివ బాలకృష్ణ, ఆయన సోదరుడు శివ నవీన్ అరెస్టు అయ్యారు. అయితే ఇటీవల వారు కొద్ది రోజుల క్రితం బెయిల్‌పై విడుదలయ్యారు.

# అనునిత్యం అప్రమత్తంగా ఉండాలి

## ఎంఈటీలతో హైడ్రా కమిషనర్ రంగనాథ్



**హైదరాబాద్, మహా :** వర్షాకాలం పని చేసే మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ (ఎంఈటీ)లు 24 ఇంటూ 7 మాదిరి పని చేయడమే కాకుండా అను నిత్యం అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. వాతావరణ హెచ్చరికలను క్షుణ్ణంగా పరిశీలించి.. వర్షానికి ముందే సన్నద్ధమవ్వాలన్నారు. జులై 1వ తేదీ నుంచి రంగంలోకి దిగిన మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌ల కాంట్రాక్టర్లతో పాటు హైడ్రా మార్షల్స్, డీఆర్ఎఫ్ మేనేజర్లు, సూపర్‌వైజర్లతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో హైడ్రా కమిషనర్ మాట్లాడారు. వర్షం పడితే తలెత్తే సమస్యలపై పూర్తి అవగాహనతో ఉండాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తుతుందో అందుకు పరిష్కారం ఏంటో కూడా తెలియాలన్నారు. వర్షం పడినప్పుడు అప్రమత్తంగా ఉండి రహదారులను, నివాసాలను వరద ముంచెత్తకుండా జాగ్రత్త పడాలన్నారు. వర్షం లేనప్పుడు సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు.

**ప్రజాసమస్యలపై పరిధిలు వద్దు**

వర్షాకాలం ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసే బాధ్యతను హైడ్రాపై నమ్మకంతో రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందని, అది వమ్ము కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని హైడ్రా కమిషనర్ సూచించారు. ప్రజల విశ్వాసం చూరగొనేలా మన పని విదానం ఉండాలన్నారు. ప్రజలు సమస్యల్లో ఉంటే పరిధిలు గీసుకొని ఉండాల్సిన పని లేదని.. పక్క సర్కిల్‌లో సమస్య ఉంటే వెంటనే అందరూ చేతులు కలపాలని కాంట్రాక్టర్లకు సూచించారు. జీహెచ్ఎంసీ, జలమండలి, హైడ్రా, ఇరిగేషన్ ఇలా సంబంధిత శాఖలన్నిటితో అధికారులు సమన్వయం ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడడమే లక్ష్యం కావాలన్నారు. వాహనాలు మొరాయించడం, నీటిని తోడే పంపులు పని చేయక పోవడం లాంటి సమస్యలు రాకుండా జాగ్రత్త పడాలన్నారు. ఎవరికైనా ఇబ్బంది ఉంటే వెంటనే సంబంధిత అధికారి దృష్టికి తీసుకువస్తే ఆ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాలు ఫిర్యాదు చేసినప్పుడు వాటి పరిష్కారానికి ఎంతో బాధ్యత పడాలన్నారు.

# బెట్టింగ్ వ్యసనం

- డబ్బు కోసం కన్నతండ్రినే కడతేర్చిన కొడుకు
- గచ్చిబౌలిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

**హైదరాబాద్, మహా :** ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనం ఒక కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. డబ్బు కోసం కన్న కొడుకే తండ్రి పాలిట కాలయముడయ్యాడు. ఈ దారుణ ఘటన హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం ఈ హత్య మంగళవారం జరిగింది. వనపర్తికి చెందిన హనుమంత్ నాయక్ (38) ఇటీవల తన స్థలాన్ని విక్రయించగా వచ్చిన రూ.6 లక్షలను ఇంటికి తెచ్చారు. ఆయన కుమారుడు రవీందర్ నాయక్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసయ్యాడు. తండ్రికి తెలియకుండా ఇంట్లో ఉన్న డబ్బు నుంచి రూ.2.5 లక్షలు తీసుకుని బెట్టింగ్‌లో పోగొట్టుకున్నాడు. కొన్ని రోజులుగా హనుమంత్ నాయక్ డబ్బు గురించి కొడుకును నిలదీయగా, తన స్నేహితుడికి అప్పుగా ఇచ్చానని చెబుతూ రవీందర్ కాలయాపన చేశాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆ స్నేహితుడు డబ్బు తిరిగి ఇస్తున్నాడని తండ్రిని నమ్మించాడు. మాటలతో మభ్యపెట్టి ఆయనను ఒక నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. అక్కడ తన వెంట తెచ్చుకున్న కత్తితో తండ్రి గొంతులో పొడిచి అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. అనంతరం రవీందర్ తన బావ రమేష్ నాయక్‌కు ఫోన్ చేసి, తన తండ్రి చనిపోయినట్లు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులకు రవీందర్ ప్రవర్తనపై అనుమానం కలిగింది. దీంతో రమేష్ నాయక్ గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి నిందితుడు రవీందర్ నాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కొండా మురళి వ్యాఖ్యల ఎఫెక్ట్

## మంత్రి సురేఖ ఎన్నికల ఖర్చుపై ఈసీకి బీజేపీ నేత ఫిర్యాదు

ఎన్నికల్లో తప్పుడు అఫిడవిట్ ఇచ్చారని బీజేపీ నేత ప్రదీప్ రావు ఆరోపణ

రూ.70 కోట్లు ఖర్చు చేశామన్న కొండా మురళి వ్యాఖ్యలే ఫిర్యాదుకు ఆధారం

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఎన్నికల వ్యయం విషయంలో కొత్త చిక్కుల్లో పడ్డారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా భారీగా ఖర్చు చేసి, ఎన్నికల సంఘానికి తప్పుడు అఫిడవిట్ సమర్పించారని ఆరోపిస్తూ బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్ రావు కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీ) ఫిర్యాదు చేశారు. ఇటీవల మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి చేసిన వ్యాఖ్యలే ఈ ఫిర్యాదుకు ప్రధాన కారణంగా నిలిచాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం తాము సుమారు 70 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, ఇందుకోసం తమకున్న 500 ఎకరాల భూమిలో 16 ఎకరాలు అమ్మవలసి వచ్చిందని ఆయన బహిరంగంగా పేర్కొన్నారు. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ ఉన్నత వర్గాలతోనే పోటీ పడ్డానని, తనకు ఎవరూ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఎన్నికల వ్యయ పరిమితిని మించి ఉన్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కొండా మురళి చేసిన ఈ వ్యాఖ్యలను ఆధారంగా చూపుతూ, ప్రదీప్ రావు తన ఫిర్యాదును ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కొండా సురేఖపై బీజేపీ అభ్యర్థిగా ప్రదీప్ రావు పోటీ చేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఖర్చుకు, వాస్తవ ఖర్చుకు పొంతన లేదని ఆయన తన ఫిర్యాదులో ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం ఇది మొదటిసారి కాదు. గతంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కూడా ఇదే అంశంపై ఈసీని ఆశ్రయించారు. ఇప్పుడు బీజేపీ నుంచి కూడా ఫిర్యాదు అందడంతో కొండా సురేఖపై ఒత్తిడి పెరుగుతోంది.

# రాష్ట్రంలో యూరియా కొరత

- సరిపడేంత ఎరువులు సరఫరా చేయాలి
- కేంద్ర ప్రభుత్వం అలసత్వంతో రైతులకు ఇబ్బందులు
- కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఈ విషయంలో చొరవ తీసుకోవాలి
- కేంద్ర మంత్రులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ



**హైదరాబాద్, మహా:** రాష్ట్రానికి సరిపడేంత యూరియాను కేటాయించాలని కోరుతూ కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. యూరియా కొరతను అధిగమించేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని కేంద్ర కెమికల్ అండ్ ఫర్టిలైజర్స్ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు మంత్రి లేఖలు రాశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రాష్ట్రంలో యూరియా అవసరం అంతకంతకు పెరిగిపోయిందని తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రాష్ట్రానికి 5 లక్షల మెట్రిక్ టన్నుల కోటాను కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిందని.. అందులో ఇప్పటి వరకు 3.06 లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా అయిందని చెప్పారు.

**1.60 లక్షల మెట్రిక్ టన్నులు రావాలి..**

అరకొర సరఫరా కారణంగా రాష్ట్రంలో దాదాపు 1.94 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఏర్పడిందని చెప్పుకొచ్చారు. తాజాగా జులై నెలకు నిర్దేశించిన సప్లై ప్లాన్ ప్రకారం రాష్ట్రానికి 1.60 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందన్నారు. కానీ అందులో 60 శాతం ఇంపోర్టెడ్ యూరియాను కేటాయించటం ఆందోళన కలిగిస్తోందని లేఖలో పేర్కొన్నారు. దిగుమతుల ద్వారా రాష్ట్రానికి రావాల్సిన యూరియా సకాలంలో రాష్ట్రానికి చేరుకునే పరిస్థితి లేదని, ఇప్పటి వరకు ఆ యూరియాను రవాణా చేసేందుకు అవసరమైన నౌకల కేటాయింపు జరగలేదని లెటర్‌లో ప్రస్తావించారు. దీంతో ఖరీఫ్ పంటలకు అనువైన సమయంలో యూరియా కొరత రైతులను ఆందోళనకు గురి చేస్తోందని మంత్రి తుమ్మల కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. యూరియా సరఫరాపై కేంద్రం తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జులై నెలకు కేటాయించిన 0.97 లక్షల మెట్రిక్ టన్నుల ఇంపోర్టెడ్ యూరియాకు నౌకలను కేటాయించాలని కోరారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి తెలంగాణకు స్వదేశీ యూరియా సరఫరాను 30,800 టన్నుల నుంచి 60,000 టన్నులకు పెంచాలని వినతి చేశారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు తలెత్తిన యూరియా లోటును భర్తీ చేయడానికి అదనపు కోటాను కేటాయించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు లేఖలో కోరారు.

# పట్టణ కూలీలకు ఆత్మీయ భరోసా

- ఎందుకు వర్తింపజేయట్లేదు?
- నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలి
- సీఎస్, పురపాలక కార్యదర్శికి హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలోని పట్టణ కూలీలకు 'ఆత్మీయ భరోసా' ఎందుకు వర్తింపజేయట్లేదని ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక కార్యదర్శికి ఉన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. దీనిపై నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఈనెల 29కి హైకోర్టు వాయిదా వేసింది. పట్టణ కూలీలకు ఆత్మీయ భరోసా అమలు చేయాలని గతంలో హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఆదేశాలను అమలు చేయడం లేదంటూ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. నారాయణపేటకు చెందిన శ్రీనివాస్ ఈ పిటిషన్ వేయగా.. ఆయన తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు.

# రూ. 12 వేల కోట్లతో హ్యామ్ రోడ్లు

## మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

నల్గొండ, మహా : రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రాలకు రూ. 12000 కోట్లతో హ్యామ్ విధానంలో డబుల్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ రహదారి పనులకు ఆగస్టు మొదటి వారంలో టెండర్లను పిలువనున్నట్లు ఆయన వెల్లడించారు. బుధవారం మంత్రి ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్ష అనంతరం 6 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన ఆర్ అండ్ బి ఎస్ ఈ కార్యాలయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... హ్యామ్ విధానంలో మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రాల డబుల్ రోడ్డు నిర్మాణానికి గాను గత క్యాబినెట్ లో ఆమోదం పొందడం జరిగిందని, ఇందులో భాగంగా కాంట్రాక్టర్ 40%, బ్యాంకు ద్వారా 60 శాతం రుణం తీసుకుని రోడ్ల నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. ఈ విషయంపై గురువారం ఎర్రమంజిల్ లోని ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నామని, ముందుగా 10 ప్యాకేజీలకు సంబంధించి 3 వేల కోట్ల రూపాయలతో పనులకు టెండర్లు పిలువనున్నామని , మొదటి దశలో 5190 కోట్లతో, రెండవ దశలో 7000 కోట్లతో పనులు చేపట్టనున్నామని తెలిపారు. హ్యామ్ విధానం 7 రాష్ట్రాల్లో అమల్లో ఉందని, మన రాష్ట్రంలో పంచాయతీరాజ్ ద్వారా కూడా 15 వేల కోట్ల రూపాయలతో, మొత్తం 29 వేల కోట్ల రూపాయలతో హ్యామ్ రోడ్లు నిర్మించనున్నామని చెప్పారు.

# భూ సమీకరణకు కొత్త చట్టం

## సరికొత్త నిబంధనలతో రూపకల్పన
## మార్గదర్శకాలకు త్వరలోనే ప్రతిపాదనలు
## విస్తరిత హెచ్ఎండీఏ పరిధిలో అమలు

**హైదరాబాద్, మహా :** భూ సమీకరణ పథకం (ల్యాండ్ పూలింగ్ స్కీమ్)కు మరిన్ని సంస్కరణలను జోడించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. విస్తరిత హెచ్ఎండీఏ పరిధిలో అమలు చేయనుంది. భూ సమీకరణ పథకం 2017తో ఆశించిన ప్రయోజనాలు నెరవేరకపోవడంతో ఆస్థానంలో సరికొత్త చట్టాన్ని తీసుకురావాలని భావిస్తోంది. సరికొత్త నిబంధనలు, మార్గదర్శకాలతో ల్యాండ్ పూలింగ్ ఏరియా డెవలప్‌మెంట్ (ఎల్‌పీఏడీ) అనే ముసాయిదా చట్టాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయడానికి ఓ కన్సల్టెన్సీని నియమించేందుకు హెచ్ఎండీఏ టెండర్లను ఆహ్వానించింది.

**పట్టాభూములకే అవకాశం**

అభివృద్ధి అనేది ఒకే ప్రాంతానికి పరిమితమవ్వకుండా ఔటర్ అవతల మినీ నగరాలు, టౌన్‌షిప్ లను తీసుకువచ్చేందుకు అప్పటి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ స్కీమ్ 2017 తీసుకువచ్చింది. అయితే దానికి ఆశించిన స్పందన రావడం లేదు. ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌ను 733 ఎకరాలతో ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌లో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టగా, అదే తరహాలో స్వరాష్ట్రంలోనూ ఎనిమిదేళ్ల క్రితం తీసుకొచ్చారు. నాటి చట్టం ప్రకారం ఇన్ముల్ నర్వ (95 ఎకరాలు), లేమూరు (84 ఎకరాలు)లో లే అవుట్‌లు అభివృద్ధి చేయగా, ప్రతాపసింగారం (110 ఎకరాలు)లో పనులు చేపట్టాల్సి ఉన్నది. ఈ స్కీమ్ వచ్చిన ఎనిమిదేళ్లలో మూడు ప్రాంతాల్లో 289 ఎకరాలే సేకరించారు. 2017లో ఉన్న కొన్ని నిబంధనలు ప్రభుత్వానికి, రైతులకు ఇబ్బందికరంగా మారాయి. కేవలం పట్టా భూములకే అవకాశం కల్పించారు. అసైన్డ్, సీలింగ్ భూములు సేకరించే అవకాశం లేదు.

**ఇతర రాష్ట్రాల్లో ఉపయుక్తంగా..**

దేశంలోని పలు నగరాల్లోని డెవలప్ మెంట్ అథారిటీలకు ల్యాండ్ పూలింగ్ స్కీమ్ వరంగా మారింది. ప్రధానంగా మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్ తదితర రాష్ట్ర ప్రభుత్వాలు ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌కు నోటిఫికేషన్ వేయగానే రైతులు స్వచ్ఛందంగా భూమిలిచ్చి పరిహారంగా మరోచోట అభివృద్ధి చేసిన మరింత భూమిని తీసుకుంటున్నారు. అక్కడి ప్రభుత్వానికి, స్థానిక సంస్థలకు పెద్దఎత్తున ల్యాండ్ బ్యాంకు అందుబాటులోకి వస్తోంది. ఆయా రాష్ట్రాల్లో ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌కు రైతులు, ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుండటంతో 2017లో రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌ను తెలంగాణలో అమలు చేసేందుకు మార్గదర్శకాలతో ఉత్తర్వులిచ్చింది. కానీ ఇప్పటి వరకు కేవలం హెచ్ఎండీఏ పరిధిలో మినహా రాష్ట్రంలో ఎక్కడా ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌ను అమలు చేయలేదు. హెచ్ఎండీఏ పరిధిలో కూడా ఆశించిన ప్రయోజనాలు నెరవేరలేదు

## కొత్త నిబంధనలతో చట్టం

రాష్ట్రం మొత్తం కాకుండా విస్తరించిన హెచ్ఎండీఏ పరిధి 10,472 చదరపు కిలోమీటర్లలో ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయడానికి అధికారులు సరికొత్త సంస్కరణలను తీసుకొస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ల్యాండ్‌పూలింగ్ ఏరియా డెవలప్ మెంట్ (ఎల్‌పీఏడీ) ముసాయిదా చట్టాన్ని తీసుకురావాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. హెచ్ఎండీఏ పరిధిలో జాతీయ, రాష్ట్రీయ రహదారులతో పాటు ప్రధాన ప్రాంతాల రహదారుల వెంట ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి తీసుకురావాలని భావిస్తోంది. ఈ చట్టానికి అవసరమైన నియమాలు, మార్గదర్శకాలు రూపొందించడానికి ఓ కన్సల్టెన్సీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు ఆదేశాలిచ్చింది. విస్తరించిన హెచ్ఎండీఏ పరిధిని ఆధారంగా చేసుకొని ల్యాండ్‌పూలింగ్ ఏరియా డెవల్‌పమెంట్ ముసాయిదా చట్టం ఉండాలని, ఈ చట్టానికి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న మార్గదర్శకాలు, నియమాలను జోడించాలని సూచించినట్లు సమాచారం. ముసాయిదా చట్టానికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయడానికి హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో కన్సల్టెన్సీ నియామకానికి చర్యలు చేపట్టారు. ఆరు నెలల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టెండర్ నోటిఫికేషన్‌లో నిర్ణయించారు. శివారు ప్రాంతాల్లో ల్యాండ్ బ్యాంక్ పెంచడానికి, టౌన్‌షిప్ లను తీసుకురావడానికి ల్యాండ్ పూలింగ్ ఏరియా డెవలప్ మెంట్ (చట్టం) ఉపయుక్తంగా మారుతుందని హెచ్ఎండీఏ అధికారులు అభిప్రాయపడుతున్నారు..



# ట్యాపింగ్‌లో సంచలనం



## రేవంత్ సహా కాంగ్రెస్ నేతలతో మాట్లాడిన కాల్స్ ట్యాప్

### దర్యాప్తులో ఆడియోలు విని ఖంగుతిన్న ఆరా మస్తాన్

తెలంగాణ, ఏపీ లీడర్లతో మాట్లాడిన కాల్స్ ట్యాప్ చేసిన ప్రభాకర్ రావు టీం

రెండుగంటల పాటు విచారించిన సిట్ అధికారులు

*తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో విచారణ కొనసాగుతోంది. ఆ క్రమంలో పలు కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా పొలిటికల్ స్ట్రాటజిస్ట్ ఆరా మస్తాన్ ఫోన్ సైతం ట్యాప్ అయినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. దీంతో అతడిని సైతం దర్యాప్తు అధికారులు బుధవారం కార్యాలయానికి పిలిపించి విచారించారు. ఈ సందర్భంగా ఎన్నికలు, ఉప ఎన్నికల సమయంలో.. కాంగ్రెస్ పార్టీ నేతలతో ఆరా మస్తాన్ మాట్లాడిన ఫోన్ కాల్స్‌ను దర్యాప్తు అధికారులు వినిపించారు. వీటిని విన్న ఆరా మస్తాన్ షాక్‌కు గురైనట్లు తెలుస్తుంది. 2023 నవంబర్‌లో అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, కొండల్ రెడ్డితోపాటు చామల కిరణ్ కుమార్ రెడ్డితో ఆరా మస్తాన్ పలు సందర్భాల్లో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డితో మాట్లాడిన కాల్స్‌ను ప్రభాకర్ రావు టీమ్ ట్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. ఇక 2023 సెప్టెంబర్ నుండి ఆరా మస్తాన్ ఫోన్ ట్యాప్ అయినట్లు ఈ దర్యాప్తు అధికారులు గుర్తించారు. అలాగే ఏపీకి చెందిన పలువురు పొలిటికల్ లీడర్లు, వారి అనుచరులతో సైతం ఆరా మస్తాన్ మాట్లాడిన ఫోన్ కాల్స్‌ను ప్రభాకర్ రావు టీమ్ ట్యాప్ చేసినట్లు గుర్తించారు.*

- మహా, హైదరాబాద్

### 2020 నుండే ప్రణీత్ రావు టీం రికార్డ్

2020 నుంచి ఆరా మస్తాన్ ఫోన్‌ను ఈ టీమ్ ట్యాప్ చేసినట్లు గుర్తించారు. దీంతో బుధవారం ఆరా మస్తాన్‌ను సిట్ అధికారుల బృందం దాదాపు రెండు గంటలపాటు విచారణ చేసింది. ఈ సందర్భంగా ఆయన స్టేట్‌మెంట్‌ను సైతం దర్యాప్తు అధికారులు రికార్డు చేశారు. ట్యాప్ అయిన కాల్స్, ఆడియోలు చూసి దర్యాప్తు అధికారుల ఎదుటే ఆరా మస్తాన్ నిర్ఘాంత పోయినట్లు సమాచారం. ఆరా మస్తాన్ ఇన్ కమింగ్, అవుట్ గోయింగ్ అయిన వందలాది కాల్స్ ట్యాప్ చేసి రికార్డ్ చేసినట్లు ఈ సందర్భంగా గుర్తించారు. ఈ విచారణలో ఆడియోలు, ట్యాప్ అయిన డేటాను చూపించి ఆరా మస్తాన్ స్టేట్‌మెంట్‌ను దర్యాప్తు బృందం రికార్డ్ చేసింది. అలాగే తెలంగాణ ఉప ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఆరా మస్తాన్ మాట్లాడిన ఫోన్ కాల్స్ మొత్తం ప్రణీత్ రావు రికార్డ్ చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు.

### సైదులు ఫోన్ కూడా ట్యాప్

ఇటీవల కాంగ్రెస్ పార్టీకి, సీఎంకు పొలిటికల్ స్ట్రాటజిస్ట్ గా పనిచేసిన సైదులు ఫోన్ కూడా ట్యాప్ అయిందని విచారణకు పిలిచిన విషయం విదితమే. రేవంత్ తో సహా కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలతో ఆయన మాట్లాడిన కాల్స్ ట్యాప్ చేయగా, సైదులు స్టేట్ మెంట్ ను సిట్ అధికారులు రికార్డు చేశారు. 2023 ఎన్నికల సమయంలో సైదులు కు చెందిన రెండు ఫోన్లను ట్యాప్ చేయగా, అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన సర్వేలలో క్షేత్రస్థాయి పరిస్థితుల అంచనాకు సైదులు టీం పనిచేసింది.

# ఐదేళ్లపాటు సీఎం నేనే..

- సీఎం మార్పు ప్రచారానికి సిద్ధరామయ్య చెక్
- అది బీజేపీ, జేడీఎస్ చేస్తున్న ఫేక్ ప్రచారమని ఫైర్
- ముఖ్యమంత్రిని చేయాలని ఎవరిని అడగలేదు: డీకే
- ఆయనకు అండగా ఉండటం తప్ప ఇంకో ఆప్షన్ లేదని వెల్లడి

**కర్ణాటక, మహా:** 'ఐదేళ్లపాటు కర్ణాటక సీఎం నేనే' అని సీఎం సిద్ధరామయ్య క్లారిటీ ఇచ్చారు. కర్ణాటకలో నాయకత్వ మార్పు అంశంపై కొన్ని రోజులుగా వినిపిస్తోన్న వ్యాఖ్యలకు చెక్ పడింది. ఐదేళ్లు తానే కర్ణాటక ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. 'నేను సీఎంగా కొనసాగుతా. మీకెందుకు అలాంటి అనుమానాలు ఉన్నాయి అంటూ ప్రశ్నించారు. బుధవారం ఓ కార్యక్రమంలో సిద్ధరామయ్య మాట్లాడుతూ.. సీఎం మార్పు గురించి విపక్ష పార్టీలు బీజేపీ, జేడీఎస్ చేస్తున్న వ్యాఖ్యలను కొట్టిపారేశారు. వారేమైనా కాంగ్రెస్ అధిష్టనమా అని ప్రశ్నించారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ..'ఆయన (సీఎం)కు అండగా ఉండటం తప్ప నాకు ఇంకో ఆప్షన్ లేదు. నేను ఆయనకు మద్దతు ఇవ్వాలి. అధిష్టానం ఏం చెబితే అది చేయాలి' అని మాట్లాడారు. తనను ముఖ్యమంత్రిని చేయాలని ఎవరికీ అడగలేదని, నాయకత్వ మార్పు అంశంపై బహిరంగ ప్రకటనలు చేసే నాయకులకు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.



**ఇటీవల జోరుగా ప్రచారం..**

ఇటీవల కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. మరో రెండు, మూడు నెలల్లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎవరు కృషి చేశారో అందరికీ తెలుసని, ప్రస్తుతం పార్టీ అధిష్ఠానం శివకుమార్ గురించే మాట్లాడుతోందన్నారు. సెప్టెంబర్ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో 'విప్లవాత్మక' పరిణామాలు నెలకొంటాయని కర్ణాటక మంత్రి కె.ఎన్.రాజన్న కూడా ఇటీవల పేర్కొన్నారు. దీంతో త్వరలోనే నాయకత్వ మార్పు తథ్యమని అధికార పార్టీలోనూ విస్తృత చర్చ నడిచింది.





# గడువులోగా ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**యాదాద్రి భువనగిరి, మహా :** వాన కాలం సమీపిస్తున్నందున నిర్ణీత సమయంలో ఇందిరమ్మ ఇండ్ల పనులు పూర్తి చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం రామన్నపేట మండలంలోని ఉత్తటూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడుతూ... పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నిర్ణిత సమయంలో ఇందిరమ్మ ఇళ్ల పనులు పూర్తి చేసినందుకు లబ్ధిదారులను కలెక్టర్ సన్మానించారు. వర్షాలు పడుతున్నందున ఇండ్ల నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఇండ్లకు అవసరమైన మెటీరియల్ ను తెచ్చుకోవడానికి డబ్బులు లేకపోతే మహిళా సంఘాల ద్వారా లోన్ ఇప్పించి పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను కోరారు.ఎంత తొందరగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటుంటే ప్రభుత్వం ప్రతి సోమవారం మీ ఖాతాలో ఇందిరమ్మ ఇండ్ల డబ్బులు జమ చేస్తుందన్నారు. అనంతరం రామన్నపేట మండలం కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులైన కళ్ళెం. బిచ్చవమ్మ కు జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీ ప్రకారం లో బాగంగా ఈ రోజు ఆమె ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి రూ.10,000/ ఆర్థిక సహాయం అందజేశారు. కలెక్టర్ వెంట ఎమ్మార్వో శాస్త్రీ, ఎం.పి.డి.ఓ యాకుబ్ , సంబంధిత అధికారులు ఉన్నారు.



తెలంగాణలో చంద్రబాబు

# కోవర్టులు

- ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్డు కాంట్రాక్టులు చూసేది వారే
- ఆ కోవర్టులకు కరెంట్, నల్లా కనెక్షన్ కట్ చేయండి
- బనకచర్ల ఆపడానికి లేఖలు రాస్తే సరిపోదు.. ఉత్తమ్ అన్న
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన కామెంట్స్

**జడ్చర్ల, మహా:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు ఉన్నారని పేర్కొన్నారు. బుధవారం బాలానగర్ మండలం మోతి ఘనపురంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం అనిరుధ్ రెడ్డి మాట్లాడారు.

**బనకచర్ల ఆపడానికి లేఖలు రాస్తే సరిపోదు**

బనకచర్ల ఆపడానికి లేఖలు రాస్తే సరిపోదు ఉత్తమ్ అన్న.. చంద్రబాబు కోవర్టులకు కాంట్రాక్టులు, కరెంట్ కట్ చేయండని అప్పుడే ఆంధ్ర పాలకులు మన వద్దకు వస్తారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్నారు. తెలంగాణకు నీళ్లు, విద్యుత్ అవసరం ఉన్న సమయంలో బనకచర్ల లాంటి విభజనోత్తర ప్రాజెక్టులను కట్టడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు ఎమ్మెల్యే. ఇది తెలంగాణ ప్రజల హక్కులను కాలరాయడమే అని అనిరుధ్ రెడ్డి అన్నారు. తెలంగాణలో చంద్రబాబుకు కోవర్టులు ఉన్నారని.. చంద్రబాబు నాయుడు కట్టే బనకచర్ల ప్రాజెక్టును ఆపాలంటే, కోవర్టులకు నీటి కనెక్షన్లు, కరెంట్ కనెక్షన్లు కట్ చేయాలన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయకుండా ఆపాలని, అప్పుడు ప్రాజెక్టు ఆటోమేటిక్‌గా బంద్ అవుతుందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

# ఏడాదికి ఒక నెల డాక్టర్లు ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేయాలి

- ప్రైవేటు డాక్టర్లకు సీఎం రేవంత్ రిక్వెస్ట్
- ప్రైవేటు డాక్టర్లు సామాజిక బాధ్యతను కలిగి ఉండాలి
- విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నాం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని మార్చేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. బుధవారం బంజారాహిల్స్‌లో ప్రైవేట్ ఆసుపత్రిని ప్రారంభించిన సీఎం.. రాష్ట్రంలోని ప్రైవేటు డాక్టర్లకు ఈ మేరకు పిలుపునిచ్చారు. సామాజిక బాధ్యతగా ఏడాదిలో ఒక్క నెల రోజుల పాటు ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలు అందించాలని ప్రైవేటు డాక్టర్లను ఆయన కోరారు. ఏడాదిలో 11 నెలలు ఎక్కడ, ఎంత జీతానికి పని చేసినా.. ఒక్క నెల రోజుల పాటు సర్కార్ దవాఖానాల్లో పని చేయాలన్నారు. తద్వారా ఆత్మ సంతృప్తి మిగులుతుందని చెప్పారు. ప్రైవేటు డాక్టర్లు నచ్చిన ప్రభుత్వ ఆసుపత్రిని ఎంచుకుని నెల రోజులు పని చేయాలని సూచించారు. నిమ్స్, ఉస్మానియా వంటి ఆసుపత్రుల్లో పని చేస్తే అమూల్యమైన అనుభవం వస్తుందని అన్నారు. ఇది ప్రభుత్వ ఆరోగ్య సేవలను మెరుగుపరచడమే కాకుండా, ప్రైవేటు రంగానికి చెందిన నిపుణుల అనుభవాన్ని పేదలకు అందుబాటులోకి తీసుకురావడానికి సహాయపడుతుందని వ్యాఖ్యానించారు.




రాష్ట్రంలో ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం వెల్లడించారు. ఇందులో భాగంగా నిమ్స్‌లో అదనపు బ్లాక్ నిర్మాణంతో పాటు, ఎల్బీనగర్, సనత్ నగర్‌లలో కొత్త ఆసుపత్రులను నిర్మిస్తున్నామని చెప్పారు. త్వరలో 25 కొత్త ఆసుపత్రులు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ఇది ప్రభుత్వ ఆసుపత్రుల సామర్థ్యాన్ని పెంచి, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి దోహదపడుతుందన్నారు. రాబోయే వందేళ్లలో తెలంగాణ రాష్ట్రం ఏ విధంగా అభివృద్ధి చెందాలనే దానిపై 'తెలంగాణ రైజింగ్ 2047' పేరుతో ఒక విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ వెల్లడించారు. ఈ విజన్ డాక్యుమెంట్‌లో హెల్త్ టూరిజంకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. హైదరాబాద్ నగరం ఇప్పటికే దేశంలోనే ఒక ప్రముఖ వైద్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో హెల్త్ టూరిజంకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా తెలంగాణను గ్లోబల్ హెల్త్ హబ్‌గా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు.

వైద్యరంగంలో ప్రభుత్వం సాధించిన పురోగతిని వివరించారు. మెడికల్ టూరిజానికి హైదరాబాద్ హబ్ గా మారిందని పేర్కొన్నారు. ఫార్మా సూటికల్స్ రంగంలో హైదరాబాద్ ఇప్పటికే అత్యుత్తమ నగరంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు సాధించిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నాలుగు కోవిడ్ వ్యాక్సిన్లు ఇక్కడే తయారయ్యాయనీ గుర్తు చేశారు. 1961లో అప్పటి కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ లో ఐడీపీఎల్ ఏర్పాటు చేసిందని, దాని వల్లే ఫార్మారంగంలో హైదరాబాద్ అగ్రస్థానానికి ఎదిగిందని అన్నారు. దాదాపుగా 66 దేశాల నుంచి వ్యాధిగ్రస్తులు ట్రీట్మెంట్ కోసం హైదరాబాద్ కు వస్తున్నారన్నారు. హెల్త్ టూరిజం హబ్ గా తీర్చిదిద్దడంలో భాగంగా డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని హెల్త్ అడ్వైజర్ గా అపాయింట్ చేశామని ఆయన పేర్కొన్నారు. హెల్త్ విజన్ డాక్యుమెంట్ కు రూపకల్పన చేయడంలో సహకరించాలని, ఇందులో భాగస్వామ్యులు కావాలని ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో గతంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిందని రేవంత్ గుర్తు చేశారు. పేదల వైద్యానికి తమ ప్రభుత్వం వెనుకాడట్లేదని, తమ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత 1,400 కోట్ల రూపాయలకు పైగా మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదల చేశామని అన్నారు. మహిళలు అధికంగా క్యాన్సర్ బారిన పడుతున్న నేపథ్యంలో దీన్ని పరిష్కరించడానికి కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. స్వయం సహాయక గ్రూపుల్లో ఉండే మహిళలందరికీ హెల్త్ ప్రొఫైల్ ను తయారు చేయనున్నామని అన్నారు. మారుమూల గ్రామాల్లో ఉండే మహిళలు సైతం ఈ యూనిక్ కార్డు ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని పొందగలుగుతారని చెప్పారు. గతంలో ఆ మహిళ ఎలాంటి ట్రీట్మెంట్ తీసుకుంది?, ఫ్యామిలీ హెల్త్ హిస్టరీ ఏమిటీ?, ఇప్పుడు అందించాల్సిన వైద్యం ఎలాంటిది? అనేది తెలుసుకోవడం డాక్టర్లకు సులభతరమౌతుందని అన్నారు. హెల్త్ ప్రొఫైల్ కార్డుల వల్ల నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందించవచ్చని చెప్పారు.

చావడానికే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్తున్నామనే అభిప్రాయాల నుంచి ప్రజలను దూరం చేయాలనేదే తమ ప్రభుత్వ ఉద్దేశమని రేవంత్ రెడ్డి అన్నారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోన్నామని, విద్యకు రూ. 21,500 కోట్లు, వైద్యానికి 11,500 కోట్ల రూపాయల బడ్జెట్ ను కేటాయించామని వివరించారు. విదేశాల్లో నివసించే తెలంగాణకు చెందిన డాక్టర్లు.. ఇక్కడికి వచ్చినప్పుడు ఒక్క వారం రోజులైనా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి సేవలను అందించాలని రేవంత్ రెడ్డి సూచించార. దీనికి అవసరమైన ఏర్పాట్లు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచలను ఇవ్వొచ్చనీ చెప్పారు. వైద్యరంగంలో ఎంతో సేవలను అందిస్తూ వచ్చిన డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డు ఇచ్చి సత్కరించిందని, ఆయనకు భారతరత్న పురస్కారాన్ని అందజేయాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి చెప్పారు. డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి భారతరత్న పురస్కారం కోసం ఒక ముఖ్యమంత్రిగా, ప్రభుత్వం తరపు నుంచి అవసరమైన ప్రయత్నాలు చేస్తానని అన్నారు.

EDITORIAL సంపాదకీయం

# లాభాలతో పాటు ప్రాణాలూ ముఖ్యం



- కృష్ణమూర్తి
అసోసియేట్ ఎడిటర్

ప్రపంచం మొత్తం పెట్టుబడులు, లాభాల ఆలోచనే తప్ప ఎదుటి వారి ప్రాణం, విలువ తదితర అంశాలు ఏవీ పరిగణనలోకి రావడం లేదు. లాభాపేక్షతో కూడిన ఈ ప్రపంచంలో కార్మికుల ప్రాణాలకు విలువనేది లేకుండా పోయింది. పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలో సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 40 మంది మృతి చెందడం పరిస్థితికి అద్దం పడుతోంది. వరుస ప్రమాదాలు జరుగుతున్నా.. ప్రభుత్వాలు, పరిశ్రమలు, వాటి యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదన్న విషయం పాశమైలారం ప్రమాదం నిరూపిస్తోంది. ప్రమాదం జరిగిన ప్రతి సారి హడావిడి షరా మామూలుగా మారింది. నాలుగైదు రోజుల పాటు హడావిడి చేయడం ఆ తర్వాత విదిలేయడం మరో దుర్ఘటన జరిగే వరకు మళ్లీ ఆ ఊసు కూడా ఎత్తకుండా ఉండటం పరిపాటిగా తయారైంది. ఫ్యాక్టరీలలో వరుసగా ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి? ఇలాంటి ప్రమాదాలను అరికట్టడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏంటి? కార్మికులకు సురక్షితమైన పని వాతావరణం కల్పించడంలో పరిశ్రమలు ఏ మేరకు బాధ్యత వహిస్తున్నాయి? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతూనే ఉన్నాయి.

ప్రతి పనిలో లాభం చూసే ఈ మెటీరియలిస్టిక్ ప్రపంచంలో ప్రాణాలకు విలువనేది లేకుండా పోయిందన్నది వాస్తవం. వస్తువులు, డబ్బులు, లాభాలకు ఇచ్చే విలువ కూడా మనిషి ప్రాణానికి ఇవ్వలేకపోతున్నారు. ప్రాణాలు గాల్లో కలుస్తున్నా చీమకుట్టినట్టన్నా బాధ కలగడం లేదు. ఏసీ గదుల్లో కూర్చుని యవ్వారాలు చక్కబెట్టే అధికారులు, వ్యాపారులు, నేతలకు.. యంత్రాల మధ్య పనిచేసే కార్మికుల గోడు వినబడటం లేదు. హైదరాబాద్ సమీపంలోని పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలో జరిగిన ప్రమాదం ఈ నిర్లక్ష్యాన్ని మరోసారి ఎత్తిచూపింది. సిగాచీ ఇండస్ట్రీస్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఇప్పటివరకు 40 మంది మృతి చెందారు. మరో 33 మంది కార్మికులు గాయాలపాలయ్యారు. గత 30 నెలల వ్యవధిలో ఒక్క తెలంగాణలోనే 10 మేజర్ ఇండస్ట్రియల్ ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 25 మంది ప్రాణాలు కోల్పోయారు. గడిచిన మూడేళ్లలో 10 పరిశ్రమల్లో పేలుళ్లు సంభవించాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రమాదం జరిగిన ప్రతిసారి అధికార యంత్రాంగం హడావిడి చేయడం తప్ప, ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కొన్ని రోజుల తర్వాత ఆ కంపెనీ యజమానులు ఎలాగోలా అనుమతులు తెచ్చుకుని తిరిగి కార్యకలాపాలు ప్రారంభిస్తున్నారు. కుటుంబాలను పోషించుకునేందుకు కార్మికులు ఆ భయాల మధ్యే పనులు చేస్తున్నారు.



కార్మికులు ఎంత దారుణమైన పరిస్థితుల్లో పనిచేస్తున్నారో పాశమైలారం ప్రమాదం అద్దం పడుతోంది. కెమికల్ ఫ్యాక్టరీల్లో వరుసగా ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి? ఇలాంటి ప్రమాదాలను అరికట్టడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏంటి? కార్మికులకు సురక్షితమైన పని వాతావరణం కల్పించడంలో పరిశ్రమలు ఏ మేరకు బాధ్యత వహిస్తున్నాయి? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సిగాచీ ఇండస్ట్రీస్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో 40 మందికి పైగా మృతి చెందగా.. 30 మంది తీవ్ర గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలంలో మృత దేహాలు గుర్తుపట్టని స్థితిలో పడి ఉన్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో 700 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వెలువడినట్లు తెలుస్తోంది. దీంతో మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. డీఎన్ఏ టెస్టుల ద్వారా మృతదేహాలను గుర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## ఎలాంటి వాతావరణంలో కార్మికులు పనిచేస్తారు?

తయారీ రంగంలో పరిశ్రమలల్లో చాలా క్లిష్టమైన పరిస్థితులు ఉంటాయి. భారీ యంత్రాల వల్ల అధిక శబ్దం ఉంటుంది. దుమ్ము, రసాయనాలు, పొగ వంటి కాలుష్య కారకాలుంటాయి. వాతావరణం చాలా వేడిగా లేదా చాలా చల్లగా ఉంటుంది. ఇక యంత్రాలు, పదునైన వస్తువులు మధ్య కార్మికులు పనిచేస్తారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు, మండే స్వభావం ఉన్న కెమికల్స్ వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో చెవులు, కళ్లు, చర్మం లాంటి అవయవాలు దెబ్బతింటాయి.

## వరుస ప్రమాదాలు కారణం ఏంటి ?

28 మే 2024లో కాజిపల్లిలోని హెటెరో ఫార్మా పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగింది. ఏప్రిల్ 2023లో మల్లాపూర్‌లోని ఏకశిలా కెమికల్స్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం సంబవించింది. దీని ప్రభావం పక్క పరిశ్రమలపైనా పడింది. 28 జులై 2021లో జీడిమెట్లలోని నాసెన్స్ ల్యాబ్స్‌లో బాయిలర్‌లో మంటలు చెలరేగాయి. 12 డిసెంబర్ 2020లో బొల్లారంలోని వింధ్యా ఆర్గానిక్స్ పరిశ్రమలో కెమికల్ రియాక్టర్‌లో బ్లాస్ట్ జరిగింది. 14 సెప్టెంబర్ 2019లో నాచారంలోని డీఎస్ఎన్ ల్యాబ్స్‌లో పేలుడు చోటు చేసుకుంది. ఈ ఏడాది 4 జూన్‌లో బొమ్మల రామారంలోని రీజెనెసిస్ పరిశ్రమలో నైట్రోజన్ ఆధారిత పేలుడు జరిగింది. 2018లో పటాన్‌చెరు అగర్వాల్ రబ్బర్ ఫ్యాక్టరీలో మెటీరియల్ కంబషన్ జరిగి మంటలు చెలరేగాయి. 2015లో కుకట్‌పల్లిలోని గల్ఫ్ ఆయిల్ డిటోనేటర్స్ ప్లాంట్‌లో పేలుడు సంభవించింది. ఈ ప్రమాదాల్లో పదుల సంఖ్యలో కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. షార్ట్ సర్క్యూట్, రియాక్టర్లు, కంబషన్ ఛాంబర్లు, బాయిలర్లు పేలడం, మెటీరియల్ తగలబడిపోవడం వంటి కారణాల వల్ల ఈ ప్రమాదాలన్నీ జరుగుతున్నాయి. ఈ యంత్రాలు ఇలా ఫెయిల్ అవడానికి కారణం.. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్లను పాటించకపోవడం, నిర్వహణ లోపం, ప్రమాదకర కెమికల్స్, ఎక్విప్‌మెంట్‌ను సరిగా హ్యాండిల్ చేయలేకపోవడం, మెషీన్లు, కెమికల్ రియాక్షన్లపై పూర్తి అవగాహన కలిగిన నిపుణులు లేకపోవడం. తాజాగా పాశమైలారం సుగాచీ ఘటనలోనూ డ్రైయర్‌లో ఒత్తిడి కారణంగా పేలుడు సంభవించిందని ప్రాథమికంగా భావిస్తున్నారు.

## ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలేంటి?

కార్మికులు పనిచేసే వాతావరణం సురక్షితమైనదేనా అని సమీక్షించేందుకు ప్రభుత్వాలు, పరిశ్రమలు పాటించాల్సిన అనేక నిబంధనలు, వ్యవస్థలు ఉన్నాయి. కంపెనీలు సరిగా సేఫ్టీ ప్రోటోకాల్స్ పాటించాలి. వాటిని పకడ్బందీగా అమలు చేసే బాధ్యత మాత్రం ప్రభుత్వానిదే. వరుసగా ప్రమాదాలు జరుగుతుంటే పరిశ్రమలను తనిఖీలు చేసి నిబంధనలు పాటించని వారిపై ఏం చర్యలు తీసుకున్నారు అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని పరిశ్రమలు సేఫ్టీ నిబంధనలు పాటించడంలో విఫలమై.. దొడ్డిదారిలో క్లియరెన్స్‌లు తెచ్చుకుంటున్నాయని కార్మికులు ఆరోపణలు చేస్తుండటాన్ని కొట్టిపారేసే పరిస్థితి కూడా లేదు. సులభతర వాణిజ్యం పేరుతో పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుసరిస్తున్న విధానాలు, పారిశ్రామిక భద్రతను ప్రమాదంలో పడేస్తున్నాయనే ఆందోళనలు కూడా ఉన్నాయి. పరిశ్రమల్లో తనిఖీలు తక్కువగా చేసి.. వాటికవే నియంత్రణ పాటించేలా పాలసీలు రూపొందించింది ప్రభుత్వం. అయితే, ఇది కార్మికుల పాలిట గొడ్డలిపెట్టే అని, వారి హక్కులను కాలరాసినట్లు అని కార్మిక సంఘాల నాయకులు అంటున్నారు. ఇలా చేస్తే కార్మికుల భద్రత రిస్క్‌లో పెట్టి.. కంపెనీలు లాభాల వేటలో బిజీగా ఉంటాయని కార్మిక నాయుకులు ఆవేదన వ్యక్తం చేసిన సందర్భాలను చూశాం.

ఇది యాజమాన్యాలకు ఒక ఆయుధంలా మారిందని ఓ కార్మిక సంఘం నేత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానంతో పరిశ్రమలో తనిఖీలు తగ్గాయని ఆయన ఆరోపిస్తున్నారు. పాతబడిన మిషనరీ వాడటం, అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు ఫిర్యాదులో ఆరోపిస్తూ జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, న్యాయవాది దుండ్ర కుమారస్వామి మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై మానవ హక్కుల సంఘం కూడా స్పందించి పరిశ్రమ యాజమాన్యంతో పాటు పలువురికి నోటీసులను కూడా జారీ చేసింది. "(పాశమైలారం) ప్రమాదం జరిగిన కంపెనీలో పరిశ్రమల శాఖ అధికారులు, బాయిలర్స్ డైరెక్టర్స్ తనిఖీలు చేశారా? బాయిలర్లను తనిఖీ చేసి ఏవైనా సమస్యలు గుర్తించారా? బాయిలర్ల పనితీరుపై కంపెనీ యాజమాన్యానికి ఏమైనా సూచనలు చేశారా?" ఇవన్నీ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అధికారులను అడిగిన ప్రశ్నలు. పరిశ్రమకు అనుమతులు, భద్రతా ప్రమాణాలపై గురించి కూడా ఆయన ఆరా తీశారు. స్వయంగా ముఖ్యమంత్రే చెప్పినా అధికారులు ఎప్పటిలాగే హడావిడి చేసి, ఆ తర్వాత పరిశ్రమల తనిఖీలను గాలిగొదిలేస్తారా? లేదా చిత్తశుద్ధితో కంపెనీలు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకొని మరి కొంత మంది కార్మికుల ప్రాణాలు బలి కాకుండా చూస్తారా అనేది వేచి చూడాలి. ఎన్ని కమిటీలు వేసినా, ప్రభుత్వానికి ఎన్ని నివేదికలు ఇచ్చినా, ఎన్ని సూచనలు చేసినా.. వాటిని చిత్తశుద్ధితో అమలు చేయకపోతే మాత్రం కథ మళ్లీ మొదటికే వస్తుంది. ఎంత పెద్ద పరిశ్రమ అయినా.. కార్మికుల భద్రతలో నిర్లక్ష్యం వహించడానికి ఏమాత్రం తావివ్వకూడదనేది అందరి మాట. లేకపోతే ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి.

### భద్రతా ప్రమాణాల అమలులో పరిశ్రమలు విఫలం

నిజానికి సురక్షిత వాతావరణంలో పని చేయడం కార్మికులకు ప్రాథమిక హక్కు. దీన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలు కల్పించాయి. ఫ్యాక్టరీస్ చట్టం (1948), తెలంగాణ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్టం(1988), మినిమమ్ వేజెస్ చట్టం లాంటి వాటి ప్రకారం.. కార్మికులకు సురక్షితమైన పని వాతావరణం కల్పించాలి. అంతేకాకుండా కార్మికులకు హెల్మెట్లు, గ్లౌజులు, సేఫ్టీ షూలు లాంటి ప్రొటెక్టివ్ వస్తువులు ఇవ్వాలి. వీటితో పాటు మెషీన్లలో సమస్యలు రాకుండా వాటిని సరైన పద్ధతిలో నిర్వహించాలి. ప్రమాదం జరిగినా ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. యంత్రాలు, ప్లాంట్లను తరచూ నిపుణులతో తనిఖీ చేయించాలి. లోపాలు ఉంటే వెంటనే సరిచేయించాల్సి ఉంటుంది. కార్మికుల భద్రత కోసం చర్యలు తీసుకోవడంలో చాలా కంపెనీలు అశ్రద్ధ వహిస్తున్నట్లు ప్రమాదాలు జరిగిన తీరును పరిశీలిస్తే స్పష్టమవుతోంది. ప్రమాదం జరిగిన తర్వాత బాధితుల కుటుంబసభ్యులు చెప్పే విషయాలు ఆవేదన కలిగిస్తున్నాయి. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ఏం చేయాలనే దానిపై కంపెనీలు తమ కార్మికులకు శిక్షణ ఇవ్వడం లేదు. ఎమర్జెన్సీ ప్రిపేర్డ్‌నెస్ కూడా ఉండటం లేదు. ప్రమాద సమయంలో అవసరమయ్యే మౌలిక సదుపాయాలు ఎక్విప్‌మెంట్ పరిశ్రమల్లో సరిగా ఉండటం లేదు. సేఫ్టీ నిబంధనలను నామమాత్రంగా అమలు చేస్తూ కార్మికుల ప్రాణాలతో చాలా పరిశ్రమలు చెలగాటం ఆడుతున్నాయి.

# మందులు వేసుకుంటే సరిపోదు



**యోగాతో డయాబెటిస్ కంట్రోల్**

ఈ రోజుల్లో డయాబెటిస్ అతి పెద్ద సమస్యగా మారింది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు ఈ రోగంతో బాధపడుతున్నారు. డయాబెటిస్‌కి సరైన చికిత్స లేదు. కానీ సరైన జీవనశైలిని అవలంబించడం ద్వారా డయాబెటిస్‌ను ఖచ్చితంగా నియంత్రించవచ్చు. ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం రక్తంలో చక్కెరను నిర్వహించడంలో సాయపడతాయి. కొన్ని యోగాసనాలు డయాబెటిస్ రోగులకు ప్రయోజనకరంగా ఉంటాయి. ఈ ఆసనాలు చక్కెరను నియంత్రించడమే కాకుండా, శరీరానికి అనేక ఇతర ప్రయోజనాలు కూడా అందిస్తాయి. ఆ ఆసనాలు ఏంటి, వాటిని ఎలా వేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**వజ్రాసనం**

డయాబెటిస్ ఉన్నవారికి వజ్రాసనం మంచి ఆప్షన్. ఈ ఆసనం వేయడానికి, మోకాళ్లపై కూర్చుని, పిరుదులను మడమల మీద ఉంచండి. ఇప్పుడు చేతులను మోకాళ్లపై ఉంచి, వెన్నెముకను నిటారుగా ఉంచుతూ దీర్ఘంగా శ్వాస తీసుకోండి. ఈ ఆసనం తిన్న తర్వాత చేస్తారు. ఇది ఆహారాన్ని జీర్ణం చేయడంలో సాయపడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిల్ని నియంత్రిస్తుంది. ఈ ఆసనం ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది. ఇది డయాబెటిస్ పేషంట్లకు మేలు చేస్తుంది.

**ఉస్ట్రాసనం**

ఈ ఆసనం వేయడానికి, మోకాళ్లపై కూర్చుని వెనుకకు వంగి.. చేతులతో మీ చీలమండలను పట్టుకోండి. ఆ తర్వాత నెమ్మదిగా మెడను వెనుకకు వంచండి. ఈ ఆసనం రోజూ చేయడం వల్ల ఇన్సులిన్ స్రావం పెరుగుతుంది. అలాగే, బెల్లీ ఫ్యాట్ తగ్గించడంతో పాటు జీర్ణక్రియను ఆరోగ్యంగా ఉంచడంలో సాయపడుతుంది.

**చక్రాసనం**

ఈ ఆసనం వేయడానికి, వీపు మీద పడుకుని, అరచేతులను తల దగ్గర ఉంచండి. ఇప్పుడు మీ చేతులు, కాళ్ళపై బరువును ఉంచి శరీరాన్ని పైకి లేపండి. దీంతో శరీరం అర్ధ వృత్తంలో వస్తుంది. ఈ ఆసనం జీవక్రియను నియంత్రించే థైరాయిడ్ గ్రంథికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. దీన్ని క్రమం తప్పకుండా చేయడం వల్ల రక్తంలో షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటాయి.

**హలాసనం**

ఈ ఆసనం వేయడానికి, వీపు మీద పడుకుని.. కాళ్ళను ఎత్తి వెనుకకు తీసుకోండి. దీని తరువాత, కాలి వేళ్ళతో నేలను తాకడానికి ప్రయత్నించండి. ఈ ఆసనం వేయడం వల్ల ఉదర అవయవాలు మసాజ్ అవుతాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది.

**అర్ధమత్స్యేంద్రాసనం**

ఈ ఆసనం వేయడానికి.. కాళ్ళను నిటారుగా ఉంచి కూర్చోండి. ఇప్పుడు ఒక కాలును వంచి.. మరొక కాలు తొడ బయటి వైపు ఉంచండి. ఇప్పుడు శరీరం యొక్క పై భాగాన్ని వంగిన కాలు వైపు తిప్పండి. దీని కోసం చేతుల మద్దతు తీసుకోవచ్చు. ఈ ఆసనం క్లోమం, కాలేయం మూత్రపిండాలకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇలా చేయడం వల్ల జీర్ణక్రియ, జీవక్రియ మెరుగుపడుతుంది.

**శవాసనం**

ఈ ఆసనం కోసం వెల్లకిలా పడుకోండి. కాళ్ళు, చేతులను సురక్షితంగా ఉంచండి. అరచేతులు పైకి చూసేలా ఉండాలి. శరీరాన్ని పూర్తిగా రిలాక్స్ చేయండి. ఈ ఆసనం ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. శరీరం, మనస్సును శాంతపరుస్తుంది. ఇది డయాబెటిస్ నియంత్రణకు చాలా ముఖ్యం.

**ధనురాసనం**

ఈ ఆసనం వేయడానికి, పొట్ట మీద పడుకుని, మోకాళ్లను వంచి.. చీలమండలను మీ చేతులతో పట్టుకోండి. ఛాతీ, తొడలను ఎత్తండి. మీ కడుపుని నేలకు దగ్గరగా ఉంచండి. ఈ ఆసనం చేయడం వల్ల క్లోమం, కాలేయం ప్రయోజనం పొందుతాయి. అలాగే, ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. ఈ ఆసనం జీవక్రియను మెరుగుపరుస్తుంది. బెల్లీ ఫ్యాట్ తగ్గించడంలో సాయపడుతుంది.

**గమనిక**

ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

మహా పత్రిక 05
తెలుగు
గురువారం, హైదరాబాద్ | 03-07-2025 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM

# కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత పదవుల సందడి

**కాటారం, మహా :** కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం పై దృష్టి సారించింది. మంథని నియోజకవర్గంలోని మండల స్థాయిలో కార్యకర్తలతో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశాలను నిర్వహించారు. మండల,గ్రామస్థాయి కార్యవర్గాల ఎంపిక కోసం జూన్ 30వ తేదీ లోపు ఆశావాహుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోసం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, ఇన్చార్జిలను నియమించగా క్షేత్రస్థాయిలో నివేదికను తయారు చేశారు. ఐటీ శాఖ మంత్రి మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు కాటారం, మలహర్ మండలాల్లో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మంత్రి సమక్షంలో మండల శాఖ అధ్యక్ష పదవుల కోసం ఆశావాహులు నామినేషన్ వేశారు. గ్రామస్థాయిలో పదవుల కోసం పోటీలేని చోట కార్యవర్గాల ఎంపిక పూర్తి చేశారు. మంథని నియోజకవర్గంలో మండల స్థాయి కాంగ్రెస్ అధ్యక్ష పదవుల కోసం అంతట తీవ్ర పోటీ నెలకొంది. బ్లాక్ మండల గ్రామ స్థాయిలో పదవుల కోసం మూడుసార్లు పనిచేసిన నాయకులు ఆ పదవులలో మళ్లీ పోటీ చేసే అవకాశం లేదు. ఫలితంగా అన్ని పదవులలో ఈసారి అందరూ కొత్త నాయకులే పదవులు చేపట్టే అవకాశం ఉంది స్థానిక సంస్థల ఎన్నికలు వారికి సవాల్ గా ఉన్నాయి. ఈ నెలలోనే పూర్తిస్థాయిలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత పదవులను ప్రకటించే అవకాశం ఉంది. ఆశావాహులైన కార్యకర్తలు, నాయకులు తమకు కావలసిన పదవుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

**రాష్ట్ర కమిటీ లో మంథని కి ప్రాధాన్యం**

కాంగ్రెస్ రాష్ట్ర కమిటీకి నియమించిన కార్యవర్గంలో మంథని నియోజకవర్గం నుండి ప్రాధాన్యం లభించింది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సహోదరుడు శ్రీపాదరావు ట్రస్ట్ చైర్మన్ దుద్దిల్ల శ్రీను బాబు నుప్రధాన కార్యదర్శిగా నియమించారు. సంస్థ గత ఎన్నికలలో భాగంగా శ్రీనుబాబు మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్చార్జిగా గాలి అనిల్ కుమార్ అతని తోపాటు ప్రధాన కార్యదర్శులు మల్లాడి రామ్ రెడ్డి కాశి పాక రాజేష్, రహ్మత్ హుస్సేన్ లను నియమించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న దుద్దిల్ల శ్రీనుబాబు ను వరంగల్ జిల్లా పార్లమెంట్ నియోజకవర్గం ఇన్చార్జిగా నియమించారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలపై సీఐటీయూ ధర్నా

- కార్మిక ప్రతినిధులతో చర్చిస్తామన్న కమిషనర్
- సమస్యలు పరిష్కరించకుంటే కార్పొరేషన్ ను ముట్టడిస్తాం
- వరంగల్ హన్మకొండ జిల్లాల సీఐటీయూ నాయకులు




**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న వివిధ విభాగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పై తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) హనుమకొండ వరంగల్ జిల్లాల కమిటీల ఆధ్వర్యంలో సీఐటీయూ వరంగల్ జిల్లా కోశాధికారి సింగారపు బాబు, టీఎండబ్ల్యుఈయూ హనుమకొండ జిల్లా అధ్యక్షులు బరుపట్ల మహేష్ ల అధ్యక్ష న మున్సిపల్ కార్పొరేషన్ ఆవరణలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు 1)4 సార్ల బయోమెట్రిక్ హాజరు విధానాన్ని రద్దు చేయాలని 2) హార్టికల్చర్ మలేరియా కార్మికులకు కలెక్టర్ గెజిట్ ప్రకారం పెరిగిన వేతనాలను వెంటనే అమలు చేయాలనిESI, PF, ID నెంబర్లు ఇవ్వాలని, 4) వాటర్ సప్లై హార్టికల్చర్ కార్మికులకు (2023 లో పెరిగిన )వెయ్యి రూపాయలు అమలు చేయాలని, యూనిఫామ్స్ షూస్ దహన ఖర్చులు,10వేలు, పిపి కిట్స్, పనిముట్లు ఇవ్వాలని,5) జవాన్లకు కరీంనగర్ ఖమ్మంలో లాగా 19500 /₹ ఇవ్వాలని,6) పెంచిన డ్రైవర్ల వేతనాలను కౌన్సిల్ ఆమోదం ప్రకారం వెంటనే అమలు చేయాలని,7) కార్మికుల రీప్లేస్మెంట్ వెంటనే పూర్తి చేయాలని,8) చీపుర్లు, కొడవళ్ళు, గొడ్డళ్లు,పంజాలు, పుష్కాట్స్, చలి కోట్స్, రైన్ కోట్స్, యూనిఫామ్స్ స్టిచ్చింగ్ చార్జీలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించడం జరిగింది. ధర్నా అనంతరం వివిధ వింగ్ అధికారుల తో చర్చలు చేయాలని కమిషనర్ ఆదేశాల ప్రకారం కార్మిక నాయకులతో చర్చలు చేయడం జరిగింది. ఈ చర్చలలో కార్పొరేషన్ సూపరిండెంట్ ఆఫ్ ఇంజనీర్ మహేందర్ , చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ తో పాటు మలేరియా విభాగం ఇంచార్జ్ రాజా రెడ్డి , ఎంహెచ్ఓ రాజేష్, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ రమేష్ లు హాజరు కాగా సిఐటియూ నాయకులు టీ ఉప్పలయ్య సింగారపు బాబు, జన్ను ప్రకాష్, బరపట్ల మహేష్ యాస బాబు, కార్మికులు హాజరై డిమాండ్ల పరిష్కారం పై చర్చించడం జరిగింది. 8 డిమాండ్లల్లో మెజార్టీ డిమాండ్లను సంబంధిత వింగ్ అధికారులు కమిషనర్ తో చర్చించి పరిష్కరిస్తామని, వింగ్ అధికారుల పరిధిలో లేని సమస్యలను కమిషనర్ తో చర్చించాలని తెలిపారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ సిఐటియూ కార్మిక యూనియన్ తో చివరి గా చర్చించి, న్యాయమైన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేనియెడల మరో పెద్ద ఉద్యమానికి, పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## చేనేతలకు రుణమాఫీ చేయడం
# చారిత్రాత్మక నిర్ణయం

సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు

టీపీసీసీ చేనేత విభాగం రాష్ట వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత



**వరంగల్ మహా;** చేనేత విభాగం వరంగల్ జిల్లా అధ్యక్షులు దాసరి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేతలకు రుణమాఫీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిప్ప వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బాసాని కరుణాకర్ నేత హాజరయ్యారు. ఈ సందర్భంగా చిప్ప వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు చేనేత కార్మికులకు 33 కోట్ల రూపాయల మేర చేనేత రుణమాఫీ చెయ్యడం జరిగింది. గత ప్రభుత్వంలో కేటీఆర్ చేనేత మంత్రిగా ఉండి చెయ్యని రుణమాఫీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సు ప్రారంభోత్సవం లో మాట ఇచ్చి 2017 ఏప్రిల్ 1 సం నుండి ఆగస్ట్ 2024 మార్చ్ 31 వరకు చేనేత కార్మికులు తీసుకున్న లక్షలోపు వ్యక్తి గత రుణాలను మాపి చేసి చేనేత కుటుంబాలలో వెలుగు నింపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెలంగాణ చేనేత కార్మికుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కొత్తవాడ లోని చేనేత కార్మికులు స్వీట్లు తినిపించుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికులు సంబరాలు చేసుకోవాలని ఇందులో చేనేత విభాగం రాష్ట జిల్లా కార్యవర్గం పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నంబి మురళి, ఈగ శ్రీధర్, కట్ల స్వామి, ఆడెపు చంద్రమౌళి, గుర్రం రాజమౌళి, ఆనందం వెంకటయ్య, గోంగూర నారాయణ, నాసం లావణ్య, వంగ రేఖా, కందకట్ల సరళ, జెట్టబోయిన స్వరూప పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



**వరంగల్ మహా;** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షులు నారపరాజు రామచందర్ రావు ను వరంగల్ బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామచందర్ రావు మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికి ఫలితం తప్పక దక్కుతుందని, రాబోవు రోజుల్లో స్థానిక సంస్థల్లో అత్యధిక స్థానాల్లో బీజేపీ పార్టీ అభ్యర్థులను గెలిపించి వరంగల్ జిల్లాలో పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేయాలని, ప్రజా సమస్యల పై నిరంతరం పోరాటం చేయాలని సూచించారు.

# వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** దేవాలయాలను టార్గెట్ చేసుకొని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను రాచకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లాలోని, ఇబ్రహీంపట్నం, యాచారం, అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శివానంద, షరీఫ్ లను అరెస్టు చేశారు. ఎల్బీనగర్ క్యాంపు కార్యాలయంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుదీర్ బాబు మాట్లాడుతూ... గత కొన్ని నెలలుగా దేవాలయాల్లో ఉన్న పంచలోహ విగ్రహాలను టార్గెట్ చేసినా ఈ ముఠా చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ చెందిన శివానంద్, షరీఫ్ మద్యం మత్తులో నేరాలు చేస్తున్నారని తెలిపారు. దేవాలయాలలో చోరీ చేసిన పంచలోహ విగ్రహలు, ఉప్పల్ కు చెందిన క్రాంతి కుమార్ అనే వ్యక్తికి అమ్ముతున్నారని, విగ్రహాలను కొనుగోలు చేసిన వ్యక్తిని కూడా అరెస్ట్ చేసినట్లు సుధీర్ బాబు తెలిపారు. ఈ ముఠా నగర శివారు ప్రాంతాల్లో ఉన్న దేవాలయాలలో చోరీలకు పాల్పడుతున్నారని, సీసీటీవీ కెమెరా లేని దేవాలయాలనే వీరు టార్గెట్ చేస్తున్నారన్నారు. ప్రతి దేవాలయాల్లో కూడా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆలయ నిర్వాహకులకు సూచించారు. నిందితుల వద్ద నుంచి ఐదు లక్షల విలువగల 61 కిలోల పంచలోహ విగ్రహాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని రాచకొండ కమిషనర్ వెల్లడించారు. ఈ సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసిపి కేపివి రాజు, ఇబ్రహీంపట్నం ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి, తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ అధికారులను ప్రశ్నిస్తే
# అరెస్టులు చేస్తారా..!?

ఆదివాసులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల జూలుం

**మంచిర్యాల, మహా :** ఆదివాసుల ఆరాధ్య దైవం భీమన్న దేవుడి గుడిని పోల్చివేసిన ఫారెస్ట్ అధికారులను ఆదివాసీలు ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేస్తారా అని సిపిఎం జన్నారం మండల కార్యదర్శి అశోక్, లింగన్న లు ప్రశ్నించారు. జన్నారం మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల జూన్ 12న జన్నారం మండలం కోలం గూడాలో ఆదివాసుల కులదైవం భీమన్న దేవుని గుడిని ఫారెస్ట్ అధికారులు ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. గుడి కూల్చివేతను అడ్డుకున్న ఆదివాసీల కుటుంబాలపై అటవీ అధికారులు కక్షగట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగా ఈరోజు బుధవారం ఆదివాసీలైనటువంటి ఆత్రం రాజు ఇద్దరు కుమారులు ఆత్రం రవి, ఆత్రం సుధాకర్ లను ఫారెస్ట్ అధికారులు బలవంతంగా జీబులో ఎక్కించుకొని అక్రమ కేసు పెట్టి కోర్టులో హాజరు పరిచారని ఆందోళన వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా ఆదివాసీలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విరుచుకుపడుతున్నాయని అన్నారు. ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలకు విగాతాలు కలిగిస్తూ అడవిలో జీవించకుండా కఠినంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. భీమన్న దేవాలయాన్ని కూల్చివేసిన అటవీ శాఖ అధికారులు సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన ఆదివాసీలను తక్షణమే విడుదల చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో బుచ్చన్న, లక్ష్మణ్, రాజన్న, యశోద, శంకర్ లు ఉన్నారు.

## స్నేహితుని చంపి
# నిందితుడు పరార్

నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు

**రాజేంద్రనగర్ మహా ;** నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడ అపర్ణ కన్స్ట్రక్షన్ లేబర్ క్యాంపులో రోషన్ హెలా అనే వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసు తెలిపిన వివరాల ప్రకారం పుప్పాలగూడలోని అపర్ణ కంక్షన్ లేబర్ క్యాంపులో కాంట్రాక్టర్ మురళీధర్ ద్వారా రంజిత్ పండిత్ అనే వ్యక్తితో కలిసి రోషన్ హెలా పెయింటర్ ఉద్యోగంలో చేరాడు. వీరిద్దరూ కలిసి రూమ్ నెంబర్ ఈ 114కలిసి ఉంటున్నారు. మంగళవారం సుమారు అర్ధరాత్రి సమయంలో స్నేహితుల మధ్య జరిగిన గొడవలో వెస్ట్ బెంగాల్ కు చెందిన రోషన్ హెలా అనే వ్యక్తి గొంతులో రాడు దింపి హత్య చేశారు. హత్య గా భావించిన పోలీసులు సంఘటనా స్థలాన్ని క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ టీం సభ్యులతో కలిసి సాక్షాదారాలను సేకరించి పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు, పలు టీమ్లను రంగంలోకి దింపారు. నార్సింగ్ పోలీసులు డెడ్ బాడీని మార్చరికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పొట్టేల్ సినిమా దర్శకుడుకి సన్మానం



**ఆదిలాబాద్, మహా:** విద్యా ప్రాముఖ్యతను తెలియజేస్తూ నిర్మించిన పొట్టేల్ సినిమాకు రాష్ట్ర స్థాయిలో టీజీఎఫ్ ఏం (తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డ్) వచ్చిన సందర్భంగా ఆ సినిమా దర్శకుడు ఉమ్మడి జిల్లాకు చెందిన సాహిత్ మోత్కూరిని పీఆర్టీయూ టీఎస్ నాయకులు సన్మానించారు. బుధవారం సాయంత్రం ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లోని సంఘ భవనంలో పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి నరసింహ స్వామి, గౌరవ అధ్యక్షుడు డి. గోవర్ధన్, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

## పుట్టింటికి వెళ్లి వచ్చేసరికి ఇంటిని దోచుకెళ్లిన దొంగలు

21 తులాల బంగారం, లక్ష నగదు ఎత్తుకెళ్లిన దొంగలు



**రాజేంద్రనగర్, మహా :** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదర్ గూడలోని కృష్ణానగర్ కాలనీలో భారీ చోరీ జరిగింది. 21 తులాల బంగారంతో పాటు లక్ష రూపాయల నగదు దోచుకెళ్లిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు హైదర్గూడా లోని కృష్ణా నగర్ కాలనీలో స్వప్న అనే మహిళ తన కుటుంబ సభ్యులతో తన కుమారుడు పుట్టినరోజు సందర్భంగా లింగంపల్లి పుట్టింటికి వెళ్లింది. మంగళవారం రాత్రి వర్షం పడడంతో రాత్రి రాలేకపోయింది. సమయంలో పక్క రిక్క నిర్వహించిన దుండగులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి డోర్ తో పాటు బీరువా డోర్లను పగలగొట్టి 21 తులాల బంగారం తో పాటు లక్ష రూపాయలు నగదు ఎత్తుకెళ్లారు. స్థానికులు సమాచారం చేరవేయడంతో స్వప్న కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకొని చూసేసరికి చోరీ జరిగిందని తెలుసుకొని వెంటనే రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ ఫుటేజ్ లను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేస దర్యాప్తు చేస్తున్నారు.

# నార్సింగ్ లో భారీగా డ్రగ్స్ పట్టివేత

కాపుగాసి మాటువేసి పట్టుకున్న శంషాబాద్ ఎస్ఓటి పోలీసులు

కోటి 50 లక్షలు విలువైన 650 గ్రాముల హెరాయిన్ సీజ్

రాష్ట్ర ప్రభుత్వానికి సవాల్ విసురుతున్న కేటుగాళ్లు.?



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో విలువైన హెరాయిన్ సీజ్ చేసిన శంషాబాద్ ఎస్వోటి పోలీసులు. చోగారాం విజునోయి అనే వ్యక్తి, రాజస్థాన్ లో కొనుగోలు చేసి హైదరాబాదు కు తరలిస్తున్నట్లు, విశ్వసనీయ సమాచారం మేరకు నార్సింగ్ వద్ద మాటువేసిన ఎస్ఓటి పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి సుమారు కోటి యాభై లక్షలు విలువచేసే 650 గ్రాముల గోధుమ రంగు హెరాయిన్ ఉన్నట్లు గుర్తించారు. అతన్ని విచారించగా తానే హెరాయిన్ కంజుమ్ చేస్తున్నట్లు ఒప్పుకోవడం జరిగిందని పోలీసులు వెల్లడించారు. అనంతరం నార్సింగ్ పోలీసులకు అప్పగించడం జరిగింది. ఎన్డిపిఎస్ ఆక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగ్ పోలీసులు తెలిపారు.

**డ్రగ్స్ పై ఉక్కుపాదం, అయినా తగ్గేదేలే.?**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతుంటే కొందరు కేటుగాళ్లు ప్రభుత్వానికి సవాల్ గా మారారు. గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్ రవాణా కొనసాగిస్తూనే ఉన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారిని రూపుమాపేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శతవిధాలుగా ప్రయత్నం చేస్తున్న, ఎక్కడో ఒకచోట డ్రగ్స్ గంజాయి పట్టుకోవడం జరుగుతుందని తెలుస్తుంది...రాష్ట్ర ప్రభుత్వానికి సవాల్ విసురుతున్నట్లు తెలుస్తుంది.? బుధవారం రంగారెడ్డి జిల్లాలోని నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు కోటి 50 లక్షలు విలువచేసే 650 గ్రాముల హెరాయిన్ పోలీసులు పట్టుకోవడం జరిగింది.



## జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో
# పథకాలు సాధించిన శంషాబాద్ యువకులు

2 కాంస్య పథకాలు, ఒక రజత పతకాలు కైవసం

**రాజేంద్రనగర్ మహా ;** కర్ణాటక రాష్ట్రం దవనగిరిలో జరిగిన 53వ పురుషుల, 43వ మహిళ సీనియర్, 47వ పురుషులు, 32వ మహిళల జూనియర్, 26వ బాలుర, బాలికల సబ్ జూనియర్ జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో శంషాబాద్ కు చెందిన యువకులు సత్తా చాటారు మూడు పథకాలను కైవసం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లోని యాదవ్ ఫిట్నెస్ జోన్ శంషాబాద్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ముగ్గురు యువకులు కర్ణాటకలో జరిగిన జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని శంషాబాద్ కు చెందిన దన్నాడ ప్రవీణ్ యాదవ్ సీనియర్ పోటీల్లో 83 కిలోల పవర్ లిఫ్టింగ్ లో విజయం సాధించారు కాంస్య పథకం, స్క్వాట్, రజతం కైవసం చేసుకున్నారు. జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలో 93 వెయిట్ ఎత్తి గాజుల భరత్ కాంస్య పథకం సాధించారు. సబ్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని 93 కిలోలు బరువు ఎత్తి నవరతన్ కాలియా అనే యువకుడు బ్రాంచ్ రజత పథకం సాధించారు. జాతీయస్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని పథకాలు సాధించిన ముగ్గురు విజేతలను యాదవ్ ఫిట్నెస్ జోన్ శంషాబాద్ జిమ్ తరపున అభినందించారు.



## రాజ్యాంగ పరిరక్షణకై - కాంగ్రెస్
# నాయకులు పాటుపడాలి

జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్దేవ్పల్లి డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నివాసంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో చేవెళ్ల పార్లమెంటు ఇంచార్జ్ ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి ,చేవెళ్ల పార్లమెంటు ఇంచార్జ్, టిపిసిసి ఉపాధ్యక్షులు బొంతు రామ్మోహన్ రావు పాల్గొన్నారు. జూలై 4న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ పర్యటన సందర్భంగా లాల్ బహదూర్ స్టేడియంలో గ్రామ స్థాయి అధ్యక్షుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు చల్లా నరసింహారెడ్డి తెలిపారు. జై బాపు, జై భీమ్, జై సంవిధానం కార్యక్రమం ఉంటుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు సమర్ధితంగా సాగుతున్న జై సంవిధాన్ కార్యక్రమం తెలంగాణలో విజయం వైపు కొనసాగుతోందని వివరించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ధనంజయ్, ప్రేమ్ గౌడ్, అర్జున్, ఎల్లప్ప, విజయ్, మచ్చ వెంకటేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గే సభను విజయవంతం చేయాలి

పీసీసీ సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా, రేపు హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనానికి, అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే హాజరుకానున్నరని, సభకు గ్రామస్థాయి నుండి కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చి సభను జయప్రదం చేయాలని పీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ భీక్య నాయక్ మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో గ్రామ స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి సభను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులతో ఖర్గే మాట్లాడటం జరుగుతుందని, ఇదీ చరిత్రలో ఒక గొప్ప సమావేశమని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిల్లో పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలతో మాట్లాడనున్నారని తెలిపారు. పార్టీని సంస్థగతంగా మరింత బలోపేతం చేసి, ఎలా ముందకు తీసుకువెళ్లాలని, అందుకు తీసుకోవల్సిన చర్యలపై పార్టీ శ్రేణలకు, ఖర్గే దిశా నిర్దేశం చేయనున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల తీరు తెన్నులపై పార్టీ శ్రేణులతో చర్చించడంతో పాటు, ప్రజా సంక్షేమ పథకాలను ఏ విధంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలి తదితర అంశాలపై పార్టీ శ్రేణులకు సూచనలు, సలహాలు అందించనున్నట్లు తెలిపారు. సమావేశానికి పెద్ద సంఖ్యలోతరలివచ్చి విజయవంతం చేయాలని, ఖర్గే సందేశాన్ని ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు జాంగిర్, జహంగీర్ బాబా, శంకర్, జగన్, రామకృష్ణ, యాదయ్యగౌడ్, రాజేందర్, శేఖర్ గౌడ్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సిగాచి కంపెనీ సందర్శించిన మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**పటాన్ చెరు, మహా :** పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ కెమికల్స్ పరిశ్రమలో ఇటీవల జరిగిన పేలుడు ఘటన నేపథ్యంలో, ఈ రోజు సంఘటనా స్థలాన్ని ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్ సందర్శించారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహా, జగ్గారెడ్డి , నిర్మలా జగ్గారెడ్డి, పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ కలిసి పరిశ్రమ పరిసరాలను పరిశీలించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు సంఘటనా ప్రాంతంలోని పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకొని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అలాగే వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కూడా పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ANN తెలుగు
మహా పత్రిక 06
గురువారం, హైదరాబాద్ | 03-07-2025 | జిల్లా వార్తలు | DISTRICT NEWS
WWW.MAHAADAILY.COM

## ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

**పీడీఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్**



**ఆదిలాబాద్, మహా:** రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రియాంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ లను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లో డిగ్రీ కళాశాలల బంద్ నిర్వహించారు.ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న రూ. 8000కోట్ల రూపాయలు ఫీజు రీయంబర్స్మెంట్ స్కాలర్షిప్ లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ఎత్తివేసే కుట్రను ఆపాలని, డొనేషన్లు తీసుకుంటున్న ఇంజనీరింగ్ కళాశాలలను గుర్తించి వాటిని మూసివేయాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో రాష్ట్ర సచివాలయం ముట్టడికి వెనుకడబో మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు దీపా లక్ష్మి, జిల్లా నాయకులు ఆశిష్,అఖిల్, మహేంద్ర, పీవైఎల్ రాష్ట్ర నాయకులు మారుతి తదితరులు పాల్గొన్నారు.

## బాల కార్మికుల వ్యవస్థ పూర్తిగా నిర్మూలించాలి

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



**ఆదిలాబాద్, మహా** జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడానికి అన్ని శాఖల సమన్వయం ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బాలల బాల్యం బడులకు అంకితం కావాలని, బాలలు కార్మికులుగా, కర్షకులుగా కొనసాగరాదని స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేకంగా బాలలను పిల్లలను కార్మికులుగా వినియోగిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఆపరేషన్ ముస్కాన్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రతిరోజు ప్రతి ఒక్క ప్రదేశంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తూ బాల కార్మికులను గుర్తించాలని సూచించారు. ముఖ్యంగా పట్టణంలో యాచకులుగా ఉన్న చిన్నారుల పట్ల ప్రత్యేకంగా వ్యవహరిస్తూ వారిని సంక్షేమ గృహాలకు లేదా బడులకు తరలించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని ఆదివాసి ప్రజల పిల్లలు బాల కార్మికులుగా ఉన్నట్లయితే తల్లిదండ్రులకు సరైన కౌన్సిలింగ్ ఇచ్చి వారిని బడిలో చేర్పించే విధంగా కృషి చేయాలని తెలిపారు. సమిష్టి కృషితో విజయం సాధించవచ్చని, బాల కార్మికుల వ్యవస్థను సమూలంగా శాశ్వతంగా నాశనం చేయవచ్చని పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖ తరపు నుండి సిసిఎస్ బృందం, షీ టీం బృందం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇద్దరు సిఐలతో కూడిన ముస్కాన్ బృందం సంసిద్ధంగా ఉంటూ బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్ రావు, సీఐ లు చంద్రశేఖర్, గుణవంత్ రావు, పద్మ, అంజమ్మ, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, సీడబ్ల్యూసి ఛైర్మెన్ వెంకట స్వామి, డీసీపీఓ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల కోసం రైతుల దిగాలు.. ఏటా ఇదే తంతు..

**కాటారం, మహా :** అన్నదాతకు అన్నింటా కష్టాలే... ఖరీఫ్ సీజన్లో విత్తనాలు మొదలు పంట ఉత్పత్తుల విక్రయాల వరకు అదే కష్టాలు.. ఏడాది పత్తి విత్తనాలతో పాటు కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగాయి. రైతులకు పెట్టుబడి భారంగా మారింది. రైతులు ఎన్నో ఆశలతో ఖరీఫ్ సీజన్ ప్రారంభించారు. ఏడాది జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రైతులు ఎక్కువగా విడి విత్తనాలను నాటడంలోనే పెద్ద చూపారు కంపెనీ సీడ్స్ విత్తలేదు ఈ విడి విత్తనాలు వినియోగం రైతును నట్టేట ముంచుతాయా? లాభాలు తెచ్చి పెడతాయా అనేది కాలమే నిర్ణయించాలి. ఈ ఏడాది వానాకాలం సాగు పనులు మొదలెడితే ఎరువులు విషయం రైతులకు బరువుగా మారింది. ఎన్నో ఆశలతో సాగుకు అన్నదాతమైతే ఎరువుల కొరత పెరిగిన ధరలు అన్నదాత నడ్డి విరుస్తున్నాయి ఏడాది ప్రారంభంలోనే కంపెనీలు కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచడంతో రైతులపై అదనపు భారం పడింది. కాంప్లెక్స్ హీరోల ధరలు కంపెనీని బట్టి 50 నుండి 150 రూపాయల వరకు ధరలు పెరిగాయి. యాసంగి సీజన్ తో పోలిస్తే వానాకాలం సీజన్లో ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఎకరాకు నాలుగు బస్తాల వరకు రెండు మూడు రకాల కాంప్లెక్స్ ఎరువులు, రెండు బస్తాల యూరియా అర బస్తా వరకు పొటాషి




వినియోగిస్తుంటారు. భూపాలపల్లి జిల్లాలోని 12 మండలాల్లో 2,47,293 ఎకరాలలో వేద పంటలు సాగు చేస్తారని అంచనా. 82,681 ఎకరాలలో పత్తి పంటను సాగు చేశారు. జిల్లాలో 356కు పైగా ప్రైవేటు దుకాణాలు, ప్రభుత్వ రంగ సంస్థల షాపులు ఉన్నాయి.

**ప్రభుత్వ రంగ సంస్థల ద్వారానే యూరియా విక్రయం**

వ్యవసాయ పనులు పుంజుకోవడంతో మార్కెట్లో యూరియాకు డిమాండ్ నెలకొంది. యూరియా కంపెనీలు ప్రైవేట్ డీలర్లకు ఇవ్వడానికి యూరియా తోపాటు ఇతర పెస్టిసైడ్స్ లింకు తో కేటాయిస్తున్నారు. రైలు మార్గం ద్వారా జిల్లా కేంద్రాలకు వచ్చే యూరియా కేటాయింపుల్లో 75% ప్రభుత్వ రంగ సంస్థలకు 25% కంపెనీ డీలర్లకు యూరియా,కాంప్లెక్స్ ఎరువులను కేటాయిస్తున్నారు. యూరియాను డీలర్లకు ఎక్స్ కిరాయి తో కోటా ఇస్తున్నారు. దుకాణానికి డెలివరీ లేకపోవడంతో కిరాయితో ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ ధరకు విక్రయించాల్సి వస్తుందని డీలర్లు అంటున్నారు. కంపెనీలు తమకు ఇతర మందులను అంటగడుతున్నారని ఇవి రైతులకు చెబితే అంటగడుతున్నారని డీలర్లు చెబుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, డిసిఎంఎస్, ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాలకు యూరియాతోపాటు ఇతర ఎరువులను డెలివరీ ఇస్తున్నారని ప్రైవేట్ డీలరు అంటున్నారు. పిఏసిసిఎస్ షాపులకు అన్ని రకాల ఎరువులను డెలివరీ ఇస్తుండడంతో ఎమ్మార్పీ ధరకు విక్రయిస్తున్నారు. డిసిఎంఎస్ షాపులకు డెలివరీ ఇవ్వడం లేదని అదనంగా బస్తాకు 40 రైతులే భరించాల్సి వస్తుందని డీలర్లు చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలకు ఎరువులను తెలపరా చేయడంలో ప్రభుత్వము ఖచ్చితమైన నిబంధనలు అమలు పరచక పోతుండడంతో క్షేత్రస్థాయిలో ఎరువుల విక్రయాలు ఎంఆర్పి ధర కంటే ఎక్కువ విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కేవలం పిఏసిసి ల ద్వారానే ఎంఆర్పి రేటుకు ఎరువులు లభిస్తున్నాయని రైతులు తెలిపారు.

**వానాకాలం పంటలకు కావలసిన అంచనా ఎరువులు**

యూరియా 42,331 మెట్రిక్ టన్నులు, డిఏపి 22,006 మెట్రిక్ టన్నుల, ఎం ఓ పి 16,778, కాంప్లెక్స్ ఎరువులు 18,778 మెట్రిక్ టన్నులు అవసరం ఉంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎరువులు (మెట్రిక్ టన్నులలో) యూరియా 4,338, డిఏపి 815, ఎం ఓ పి 527, ఎస్ ఎస్ పి 6,715, ఎన్ పి కె 12,743 ఎరువుల నిల్వలు ఉన్నాయి.

## గంజాయి రవాణా.. నలుగురు అరెస్టు



**భూపాలపల్లి, మహా :** గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాను భూపాలపల్లి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నిషేధిత గంజాయి అక్రమ రవాణా, విక్రయానికి పాల్పడుతున్న కేసులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు భూపాలపల్లి సిఐ నరేష్ తెలిపారు.భూపాలపల్లి బాంబులగడ్డ శివారులో పోలీసులు, టాస్క్ ఫోర్స్ సంయుక్త తనిఖీలు చేస్తుండగా నలుగురు నిందితులను పట్టుకోగా ఒక వ్యక్తి పరారయ్యాడు. దేవర కిషోర్, కీసర పవన్, తుటి విజయ్, సాయి ప్రకాష్ లను అరెస్ట్ చేశారు.మోకిడి అజయ్ పరారీ లో ఉన్నాడు. నిందితుల నుండి 3 కిలోల 135 గ్రాముల గంజాయి, 4 మొబైల్ ఫోన్లు, 2 మోటార్ సైకిళ్లు స్వాధీనం వేసుకున్నట్లు భూపాలపల్లి పోలీసులు తెలిపారు. నిందితుల దగ్గర నుండి పట్టుకున్న గంజాయి సుమారు రూ. 1.56 లక్షలు ధర ఉంటుందని, ఈ గంజాయిని ఒరిస్సా నుండి తీసుకు వచ్చి భూపాలపల్లి పరిసరాల్లో విక్రయిస్తున్నారని సిఐ నరేష్ తెలిపారు.ఈ ఘటనపై ఎన్డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి, పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సిఐ తెలిపారు. గంజాయి మరియు ఇతర నిషేధిత పదార్థాలు వాడిన, విక్రయించిన చర్యలు తీసుకుంటామని , ఎవరికైనా గంజాయి సంబందిత సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని భూపాలపల్లి పట్టణ ఇన్స్పెక్టర్ డి. నరేశ్ కుమార్ తెలిపారు.

# సేవలందించాలి

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే**



**భూపాలపల్లి, మహా :** ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. బుధవారం జిల్లా లోని టేకుమట్ల పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పని తీరు, సమస్యలుపై ఆరా తీశారు. సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్‌లోని సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ, స్టేషన్ కేసుల స్థితిగతులు, పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరిగే ప్రాంతాలు, శాంతిభద్రతలు, సంఘ వ్యతిరేక కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ లో ప్రజలకు పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు తగు న్యాయం జరిగేలా పనిచేయాలని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్త సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రోడ్డుపై విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ లు నిర్వహించాలని అన్నారు. మండలంలో సీసీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలను చైతన్య పర్చాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు, చిట్యాల సి ఐ మల్లేష్, టేకుమట్ల డి సుధాకర్, సి సి ఫసియుద్దీన్ పాల్గొన్నారు.

## రిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్సలు

**సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ పిలుపు**



**ఆదిలాబాద్, మహా:** రిమ్స్ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో అందిస్తున్న నాణ్యమైన వైద్య సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ సూచించారు. తాజాగా ఆసుపత్రిలో నలుగురికి అన్నవాహిక క్యాన్సర్ శస్త్ర చికిత్సలను విజయవంతంగా జరిపినట్లు పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైద్యులు జక్కుల శ్రీకాంత్, బండారి నరేందర్, దేవిదాస్, హిమాని, సతీష్, కార్తీక్, విజయ్ మోహన్, సత్యనారాయణ, ఆర్ ఏం ఓ చంపత్ రావు తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఓ క్యాన్సర్ పేషంట్ ఒక ఊపిరితిత్తును స్తంభింప చేసి, కడుపులో నుండి ఏకంగా అన్నవహికను తొలగించి, పెద్ద సంచిని అన్నవాహికగా మార్చడం జరిగిందని, తిరిగి పేషంట్ ను యధావిధి పరిస్థితికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇటువంటి అరుదైన శస్త్ర చికిత్సలు ఆరునెలల కాలంలో దాదాపు మూడు వందలకు పైగా జరిగాయన్నారు. మున్ముందు అన్ని విభాగాల్లోనూ అరుదైన శస్త్ర చికిత్సలు జరిగేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. సూపర్ స్పెషాలిటీ అస్పత్రి లో మెరుగైన సేవలు లభిస్తున్నాయని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఫిర్యాదు దారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**హన్మకొండ మహా;** పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల అధికారులు, సిబ్బంది మార్యాద పూర్వాకంగా వ్యవహారించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎల్కతుర్తి పోలీస్ అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. తనిఖీ నిమిత్తం పోలీస్ స్టేషన్ చేరుకున్న పోలీస్ కమిషనర్ కు స్టేషన్ ఎస్.ఐ ప్రవీణ్ కుమార్ పుష్పాగుచ్చాలను అందజేసి స్వాగతం పలకగా సాయుధ పోలీసులు సీపీకి గౌరవ వందనం చేశారు. పోలీస్ కమిషనర్ పోలీస్ సిబ్బంది నిర్వహించిన పరేడ్ తో పాటు కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా సీపీ పోలీస్ స్టేషన్ పరిసరాలను, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ కు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసులకు సంబంధించి పోలీస్ కమిషనర్ క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సిబ్బంది ని శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చివరగా పోలీస్ కమిషనర్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు నమ్మకాన్ని కలిగించడంతో పాటు, పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలంటే... ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని ప్రజల సమస్యలకు తక్షణ స్పందన తోపాటు, మర్యాదపూర్వకంగా వారి ఫిర్యాదులు ఆలకించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా,కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సిఐ పులి రమేష్, తదితరులు ఉన్నారు.

## వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి

**నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే**



**వరంగల్ మహా;** బల్దియా పరిధి లోని కాలనీలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం బల్దియా పరిధి 3వ డివిజన్ పైడిపల్లి కొత్తగూడెం లోని ఎస్ సి, బి సి కాలనీ లలో వర్షపు నీరు తమ ఇళ్లలోకి చేరుతుందని స్థానికుల ఫిర్యాదు మేరకు స్పందించిన స్థానిక ఎమ్మెల్యే మేయర్ తో కలిసి డివిజన్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి స్థానికులతో నేరుగా మాట్లాడిన అనంతరం వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జన్ను షిభారాణి, సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి, ఏం హెచ్ ఓ డా.రాజేష్, ఈ ఈ సంతోష్‌బాబు, స్థానిక నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

## పట్టణంలో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



**ఆదిలాబాద్, మహా** జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇది వరకే ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు తాజాగా పట్టణంలోనూ మొదలయ్యాయి. ఈ మేరకు బుధవారం పట్టణంలోని వార్డు నెం. 45 భుక్తపూర్ లో పలు ఇళ్ల నిర్మాణాలకు ముగ్గు వేసి ప్రొసిడింగ్ కాపీలు అందించారు. ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించుకోవాలని హౌసింగ్ ఏఈ నజీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ బండారి సతీష్, వార్డు అధికారి ప్రశాంత్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీల అభ్యునతికి పాటుపడాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్, మహా:** జిల్లాలో నూతనంగా నియమితులైన ఎస్సీ, ఎస్టీ కమిటి సభ్యులు ప్రతి నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ వారి అభ్యున్నతికి పాటు పడాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి విభాగం, పీసిఆర్ చట్టం, పీఓ ఏ చట్టం అమలుపై బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటి సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్,ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాక్ట్ కు సంబంధించిన అంశాలపై నూతన కమిటి సభ్యులకు విస్తృత సూచనలు చేశారు. కమిటి నూతన సభ్యులుగా శశికాంత్, లక్ష్మీకాంత్, ఉషారాణి, జంగు బాపు, శ్యామల నియమితులు కాగా వారికి అభినందనలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సభ్యుల పదవి కాలం రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. నిరంతరం గ్రామాల్లో పర్యటించి ఎస్సీ, ఎస్టీల సమాజానికి మంచి చేసేలా కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేయాలని తెలిపారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ నూతన కమిటి సభ్యులు చురుకుగా పనిచేయాలని, ఎస్సీ ఎస్టీ చట్టాల పై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ప్రభుత్వ పథకాలలో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యతనిస్తూ సహాయ సహకారాలు అందిస్తున్న కలెక్టర్ ను అభినందించారు. అందరి సమన్వయం తో ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని చబ్రా, సబ్ కలెక్టర్ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం అవసరం

**ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్**



**హన్మకొండ మహా;** పోలీసులు తమ విధుల్లో అత్యుత్తమంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యం ఎంతో కీలకమని ఈస్ట్ జోన్ డీసీపీ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మూడు రోజుల పాటు జరిగే భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను బుధవారం ఈస్ట్ జోన్ డీసీపీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్, ఖమ్మం పోలీస్ కమీషనరేట్, మహబూబాబాద్ తో పాటు భద్రాద్రి కొత్తగూడెం పోలీస్ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది డ్యూటీ మీట్ లో భాగంగా కంప్యూటర్ పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్ లిఫ్టింగ్, ప్యాకింగ్, హ్యాండ్లింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫోటోగ్రఫీ, వీడియో గ్రఫీ వంటి విభాగాల్లో సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ప్రతి విభాగంలో ప్రతిభ కనబర్చిన వారిని, త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ కోసం ఎంపిక చేయడం జరుగుతుంది. ఈ సంవత్సరం రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ పోటీలు కూడా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలోనే నిర్వహించబడతాయి. అనంతరం డీసీపీ మాట్లాడుతూ ఈ డ్యూటీ మీట్ లు అధికారులకు తమ నైపుణ్యాలను మెరుగుపర్చే విధంగా దోహదపడతాయని అంతేకాకుండా నేరాలను త్వరితగతిన ఛేదించేందుకు, సాక్ష్యాలను శాస్త్రీయంగా విశ్లేషించేందుకు, ప్రజలకు న్యాయం అందించేందుకు ఈ వృత్తి శిక్షణ ఎంతో అవసరమని తెలిపారు.



## ఆస్కి డైరెక్టర్ ను కలిసిన బల్దియా కమిషనర్

**వరంగల్ మహా;** అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) డైరెక్టర్ డా.జనార్ధన రెడ్డి నీ జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ బుధవారం హైదరాబాద్ లో మర్యాదపూర్వకం గా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భం గా కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో డైరెక్టర్ కమిషనర్ కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురు బల్దియా కు శానిటేషన్ విభాగం లో ఆస్కి సాంకేతిక సహకారం అందిస్తున్నందున ఆ ప్రాజెక్ట్ ల గురించి చర్చించారు.



## నైట్ వాచ్‌మెన్‌ను సత్కరించిన ఆలయ ఈవో, చైర్మన్

**వరంగల్ మహా;** వరంగల్ నగరం బట్టల బజార్ లోని ప్రాచీన ప్రసిద్ధిగాంచిన శ్రీ బాలానగర వెంకటేశ్వర స్వామి ఆలయంలో గత 33 సంవత్సారాలుగా నిబద్ధతతో నైట్ వాచ్మెన్ గా పని చేసిన వీరన్న ను బుధవారం పదవి విరమణ చేసిన సందర్భంగా ఆలయ ఈ ఓ, చైర్మన్, ఆలయ సిబ్బంది మాజీ ధర్మకర్త ఆలయం లోని సేవా సమితి సభ్యులు వీరన్న కుటుంబ సభ్యుల సమక్షంలో అతనిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈ.ఓ ఏలపాటి రత్నాకర్ రెడ్డి, చైర్మన్ పరశరమ్, శ్రీనివాసా చారి,అర్చకులు సిబ్బంది, సేవా సమితి సభ్యులు వీరన్న సేవలను కొనియాడారు.

## 4న హైదరాబాద్ లో నిర్వహించే సమావేశాన్ని జయప్రదం చేయాలి

**టీపీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి**

**ఆదిలాబాద్, మహా:** ఈనెల 4న హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో జరిగే జైభీం , జైబాపు , జైసంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీపీసీసీ కార్యదర్శి ,కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అడిషనల్ ఇంచార్జి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానికంగా తన దృష్టికి వచ్చిన సమస్యలను అధిష్టానం ముందు ఉంచుతానని తెలిపారు. శుక్రవారం జరిగే కార్యక్రమంలో పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే పాల్గొంటారని నియోజక వర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో విజయం సాధించడం ముఖ్యమని అందుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళాలని పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో నాయకులు గిమ్మసంతోష్ , పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేష్,మాజీ కౌన్సిలర్లు సందా నర్సింగ్, జఫార్ అహ్మద్,సుధాకర్ గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు శాంతన్ రావు, లోక ప్రవీణ్ రెడ్డి, రావుల సోమన్న, మల్లయ్యయాదవ్,రాజేశ్వర్ ,శ్రీలేఖ, లతా, సోనియా మంథని, ప్రభావతి, ఉయిక ఇందిర తదితరులు పాల్గొన్నారు.



## నిత్యాన్నదానం చేస్తున్న కంది శ్రీనివాస రెడ్డికి అభినందనలు

**టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకణ్ రెడ్డి**



**ఆదిలాబాద్, మహా :** అన్నదానం మహా పుణ్యదానమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకణ్ రెడ్డి అన్నారు. బుధవారం ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఫౌండేషన్ ద్వారా మూడున్నరేళ్లుగా చేపడుతున్న నిత్యాన్నదాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆకలి తీర్చుకోవడానికి వచ్చిన వారికి ఆయన స్వయంగా వడ్డన చేశారు. పేదల కడుపు నింపాలన్న పెద్ద మనస్సుతో కంది శ్రీనివాస రెడ్డి నిత్యాన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ప్రతిరోజూ ఎంతోమంది పేదల ఆకలి తీర్చుతూ నిత్యాన్నదాత గా పేరు సంపాదించుకున్నారన్నారు. ఒక మంచి ఆలోచనతో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. ఇలా కంది శ్రీనివాస రెడ్డి సేవాకార్యక్రమాలతో ఆయన పేరు జిల్లా అంతటా చిరస్థాయిగా నిలిచి పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిమ్మసంతోష్ , పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేష్,మాజీ కౌన్సిలర్లు సందా నర్సింగ్, జఫార్ అహ్మద్,సుధాకర్ గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు శాంతన్ రావు, లోక ప్రవీణ్ రెడ్డి, రావుల సోమన్న, మల్లయ్య యాదవ్,రాజేశ్వర్ ,శ్రీలేఖ, లతా, సోనియా మంథని, ప్రభావతి, ఉయిక ఇందిర తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ వసూళ్లు రూ.1.84 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ :** జీఎస్టీ వసూళ్లు మరింత పెరిగాయి. గత నెలకుగాను రూ.1.84 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్టు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.1,73,813 కోట్లతో పోలిస్తే 6.2 శాతం అధికమయ్యాయి. మే నెలలో వసూలైన రూ.2.01 లక్షల కోట్లతో పోలిస్తే భారీగా తగ్గాయి. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రూ.2.37 లక్షల కోట్ల మేర జీఎస్టీ వసూలయ్యాయి. దీంట్లోభాగంగా జూన్ నెలలో వసూలైన రూ.1.84 లక్షల కోట్లతో దేశీయ లావాదేవీలు 4.6 శాతం అధికమై రూ.1.38 లక్షల కోట్లు నమోదు కాగా, దిగుమతి చేసుకునే వస్తువులపై విధించే జీఎస్టీ 11.4 శాతం ఎగబాకి రూ.45,690 కోట్లకు చేరుకున్నాయి. ఈ జీఎస్టీ వసూళ్లలో స్థూల సెంట్రల్ జీఎస్టీ కింద రూ.34,558 కోట్లు, స్టేట్ జీఎస్టీ కింద రూ.43,268 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కింద రూ.93,280 కోట్లు వసూలయ్యాయి. దీంతోపాటు సెస్ రూపంలో రూ.13,491 కోట్లు వసూలయ్యాయి. రిఫండ్ రూపంలో రూ.25,491 కోట్లు చెల్లించింది.







## రద్దీ సమయాల్లో రేట్లు పెంచుకోవచ్చు..

ఉబర్, ఓలా వంటి ఆన్‌లైన్ క్యాబ్ సర్వీసుల సంస్థలకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రద్దీ సమయాల్లో రేట్లు పెంచుకునేందుకు అనుమతించింది. మోటారు వాహన అగ్రిగేటర్ గైడ్‌లైన్స్‌ను రోడ్డు, రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ మంగళవారం విడుదల చేసింది. ఈ కొత్త మార్గదర్శకాల ప్రకారం.. క్యాబ్ అగ్రిగేటర్లు రద్దీ సమయాల్లో బేస్ ఛార్జీ కంటే రెండు రెట్ల వరకు ధరను పెంచుకోవచ్చు. గతంలో ఇది 1.5 రెట్లుగా ఉండేది. ఇప్పుడు దాన్ని రెండు రెట్లకు పెంచారు. అలాగే విపరీతమైన రద్దీ ఉంటే సర్ ఛార్జ్‌ను 200 శాతం పెంచుకునే వీలు కల్పించింది. అయితే, మూడు కిలోమీటర్లలోపు ప్రయాణించే వారికి అదనపు ఛార్జీలు వసూలు చేయకూడదని షరతు పెటింది. అంతేకాదు డ్రైవర్ కారణం లేకుండా రైడ్‌ను రద్దు చేస్తే రూ.100కు మించకుండా లేదా పది శాతం జరిమానా (ఏది తక్కువైతే అది) విధించవచ్చు. రైడ్ వాహనాలకు స్టేట్ కంట్రోల్ సెంటర్లకు అనుసంధానించిన లొకేషన్ ట్రాకింగ్ పరికరాలు తప్పనిసరిగా ఉండాలి.



## 14 నెలల గరిష్ఠానికి తయారీ రంగం

తయారీ రంగం జూన్‌లో బలమైన పనితీరు చూపించింది. ఈ రంగంలో పనితీరును తెలియజేసే హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) జూన్ నెలలో 58.4 పాయింట్లుగా నమోదైంది. మే నెలలో ఇది 57.6గా ఉంది. డిమాండ్ బలంగా ఉండడంతోపాటు కొత్త ఎగుమతి ఆర్డర్లు రావడం ఉత్పత్తి విస్తరణకు, ఉపాధి కల్పనకు దారితీసినట్టు హెచ్‌ఎస్‌బీసీ భారత ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారీ తెలిపారు. తయారీ రంగంలో విస్తరణ ఏడాది కాలంలోనే గరిష్ఠంగా ఉన్నట్టు చెప్పారు. కంపెనీల నిల్వలు తగ్గుతున్నట్టు పేర్కొన్నారు. మార్కెటింగ్ చర్యలకుతోడు, ఎగుమతులు పెరగడం ఇందుకు అనుకూలించినట్టు హెచ్‌ఎస్‌బీసీ ఇండియా ప్యానెల్ సభ్యులు అభిప్రాయపడ్డారు. బలమైన అమ్మకాలు తయారీ కంపెనీల్లో నియామకాల పెరుగుదలకు దారితీసినట్టు, రికార్డు స్థాయిలో ఉపాధి కల్పనకు దోహదపడినట్టు పేర్కొన్నారు. పీఎంఐ సూచీ 50 పాయింట్లకు పైన ఉంటే విస్తరణగాను, ఆ దిగువన నమోదైతే తగ్గినట్టుగాను పరిగణిస్తారు.

## మధ్యతరగతి ప్రజలకు జీఎస్టీ రిలీఫ్.. ఆ వస్తువులపై పన్ను తగ్గించే యోచనలో కేంద్రం..?

ఈ ఏడాది ఆరంభంలో ఆదాయపన్నులో రాయితీలతో వేతన జీవులకు కొంత ఊరట కల్పించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా మరో శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. నిత్యావసర వస్తువులపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) భారాన్ని తగ్గించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. మధ్యతరగతి, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు ఎక్కువగా వినియోగించే వస్తువులపై ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జీఎస్టీ శ్లాబును పూర్తిగా తొలగించడం లేదా ఈ శ్లాబులోని పలు వస్తువులను 5 శాతం శ్లాబులోకి మార్చడం వంటి ప్రతిపాదనలను కేంద్రం పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి.



టూత్‌పేస్ట్, టూత్ పౌడర్, గొడుగులు, కుట్టు మిషన్లు, ప్రెజర్ కుక్కర్లు, వంట పాత్రలు, గీజర్‌లు, తక్కువ సామర్థ్యం కలిగిన వాషింగ్ మెషీన్లు, ఎలక్ట్రిక్ ఐరన్ బాక్సులు, సైకిళ్లు, రూ.1,000 కంటే ఎక్కువ ధర ఉన్న రెడీమేడ్ దుస్తులు, రూ.500 నుంచి రూ.1,000 మధ్య గల చెప్పులు, స్టేషనరీ వస్తువులు, వ్యాక్సిన్‌లు, సిరామిక్ టైల్స్, వ్యవసాయ ఉపకరణాలు వంటివి జీఎస్టీ తగ్గింపు జాబితాలో ఉన్నట్లు సదరు వర్గాలు తెలిపాయి. ఈ నిర్ణయం అమలైతే ప్రతిపాదిత జాబితాలోని వస్తువులు తక్కువ ధరకే అందుబాటులోకి రానున్నాయి. ఈ కారణంగా పేద, మధ్య తరగతి కుటుంబాలపై కొంత భారం తగ్గనుంది.

ఈ మార్పుల వల్ల ప్రభుత్వ ఖజానాపై సుమారు రూ. 40,000 కోట్ల నుంచి రూ. 50,000 కోట్ల భారం పడొచ్చని అంచనా. అయినప్పటికీ, ధరలు తగ్గితే వినియోగం పెరిగి, దీర్ఘకాలంలో పన్ను వసూళ్లు పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఇటీవలే పరోక్షంగా సంకేతాలిచ్చిన విషయం తెలిసిందే. రాబోయే 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ నెల చివర్లో జీఎస్టీ సమావేశం జరగొచ్చని సదరు వర్గాలు సూచిస్తున్నాయి.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. దేశీయ మార్కెట్‌లో మిశ్రమ ఫలితాల మధ్య మార్కెట్లు ఉదయం ఫ్లాట్‌గా మొదలయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,790.72 పాయింట్ల వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 83,935.01 పాయింట్ల గరిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యల్పంగా 83,150.77 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది. చివరకు 287.60 పాయింట్లు పతనమై.. 83,409.69 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 88.40 పాయింట్లు తగ్గి 25,453.40 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,716 షేర్లు లాభపడగా.. మరో 2,125 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎల్‌అండ్‌టీ భారీగా నష్టపోయాయి. టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, మారుతి సుజుకి, ఏషియన్ పెయింట్స్ లాభాల్లో ముగిశాచి. రంగాలవారీగా చూస్తే.. మెటల్ ఇండెక్స్ 1.4 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఒకశాతం పెరిగాయి. పీఎస్‌యూ బ్యాంక్, క్యాపిటల్ గూడ్స్, రియాలిటీ, మీడియా, పవర్ 0.4 నుంచి 1.4 శాతం వరకు తగ్గాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ ఇండెక్స్ ఒక్కొక్కటి 0.2శాతం వరకు తగ్గాయి.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# చైనా కుతంత్రం..

## దలైలామా సంచలన ప్రకటన

టిబెటన్ ఆధ్యాత్మిక గురువు దలైలామా సంచలన ప్రకటన చేశారు. తన తదనంతరమూ 'దలైలామా' పదవీ సంప్రదాయం మనుగడలో కొనసాగుతుందని తెలిపారాయన. మరణానంతరం కూడా దలైలామా పదవి కొనసాగుతుందని.. ఈ ఎంపిక ప్రక్రియలో చైనా ప్రమేయం ఎట్టిపరిస్థితుల్లో ఉండబోదని కుండబద్దలు కొట్టారాయన. దలైలామా పదవి 600 సంవత్సరాలుగా కొనసాగుతున్న బౌద్ధ సంప్రదాయం. తదుపరి దలైలామా ఎంపిక కోసం చైనా కుతంత్రాలు చేస్తోంది. అయితే తన మరణానంతరం బౌద్ధ మతాధిపతిని ఎంచుకునే బాధ్యతను గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్ట్ అనే సంస్థకు ఆయన అప్పగించారు. ఈ ట్రస్ట్‌ను దలైలామానే 2015లో స్థాపించారు. ఇది భవిష్యత్ దలైలామాను గుర్తించే అధికారిక సంస్థగా వ్యవహరిస్తుందని బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారాయన. అంతేకాదు.. తన వారసత్వం కొనసాగాలని 14 ఏళ్లుగా టిబెట్, హిమాలయ, మంగోలియా, రష్యా, చైనా మద్దతుదారుల నుంచి అభ్యర్థనలు వస్తూనే ఉన్నాయని వెల్లడించారాయన.



అయితే టిబెట్‌పై ఆధిపత్యం చెలాయిస్తున్న చైనా ప్రభుత్వం గోల్డెన్ అర్న్ అనే పద్ధతిలో తమకు అనుకూల వ్యక్తిని దలైలామాగా నియమించాలని భావిస్తోంది. ఈ ప్రయత్నాన్ని తాజాగా దలైలామా ఖండించారు. ధర్మాన్ని నమ్మని కమ్యూనిస్టులు పునర్జన్మ వ్యవస్థలో జోక్యం చేసుకోవడం అనుచితం అని వ్యాఖ్యానించారాయన. తద్వారా తన వారసత్వాన్ని ఆధ్యాత్మిక సంప్రదాయాల ప్రకారం కొనసాగించాలన్న సంకల్పాన్ని వ్యక్తపరిచారు. తన 90వ పుట్టినరోజు కంటే నాలుగు రోజుల ముందుగానే(జులై 6న) దలైలామా తాజా ప్రకటన చేయడం చైనా ప్రభుత్వానికి గట్టి సవాలుగా మారింది.

### చైనా రియాక్షన్ ఇది

దలైలామా ప్రకటనపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం స్పందించింది. "దలైలామా, పాంచెన్ లామా, ఇతర ప్రముఖ బౌద్ధ గురువుల ఎంపిక తప్పనిసరిగా 'గోల్డెన్ అర్న్' పద్ధతిలో.. అదీ కేంద్ర ప్రభుత్వ ఆమోదంతోనే జరగాలి అని ఆ శాఖ ప్రతినిధి మావో నింగ్ తెలిపారు. ఈ పద్ధతి 18వ శతాబ్దంలో చింగ్ వంశాధిపతి ప్రవేశపెట్టిన విధానమని పేర్కొన్న ఆమె.. చైనా ప్రభుత్వం మత స్వేచ్ఛకు కట్టుబడి ఉందని, అలాగని మత సంబంధిత వ్యవహారాలపై నియంత్రణలు, బౌద్ధ గురువుల నియామకాల కోసం ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి అని మావో నింగ్ గుర్తుచేస్తున్నారు. ప్రస్తుత దలైలామా అసలు పేరు టెన్జిన్ గ్యాట్సో(89).. 14వ దలైలామా. ఈయన 1935లో టిబెట్‌లోని టాక్సేర్ గ్రామంలో జన్మించారు. 1940లో 14వ దలైలామాగా గుర్తింపు పొందారు. టిబెట్‌లో లాసా బౌద్ధ యాత్రికులకు అత్యంత పవిత్రమైన ప్రాంతం. ఆ ప్రాంతం కేంద్రంగా దలైలామా బౌద్ధ మత ప్రచారం, ఇతర కార్యకలాపాలు నిర్వహించేవారు. 1950లో చైనా టిబెట్‌ను ఆక్రమించింది. అయితే 1959లో ఆ ఆక్రమణకు వ్యతిరేకంగా లాసాలో తిరుగుబాటు జరగ్గా.. చైనా దానిని అణచివేసింది.

అంతేకాదు ప్రపంచమంతా ఇప్పుడు శాంతికాముడిగా భావించే దలైలామాను.. అప్పట్లో వేర్పాటువాదిగా, తిరుగుబాటుదారుడిగా చైనా ముద్ర వేసింది. దీంతో ఆయన భారత్‌లోని ధర్మశాలకు వచ్చి ఆశ్రయం పొందుతున్నారు. అప్పటి నుంచి చైనా టిబెట్ సంబంధాల్లో లాసా ఓ కీలక రాజకీయ కేంద్రంగా కొనసాగుతోంది. ఇక.. టిబెటన్ బౌద్ధులు మాత్రం, పారంపరిక పద్ధతుల ప్రకారమే దలైలామా ఎంపిక జరగాలని కోరుకుంటున్నారు. కానీ.. టిబెట్ చైనా స్వభూమిగా పేర్కొంటూ.. దలైలామా ఎంపికపై తమకే హక్కు ఉందని డ్రాగన్ వాదిస్తోంది. మరోవైపు దలైలామా వ్యవహారంలో చైనా జోక్యాన్ని అగ్రరాజ్యం అమెరికా సైతం ఖండిస్తూ వస్తోంది. దలైలామా ఎంపికపై చైనాకు ఎలాంటి హక్కు లేదు అని చెబుతోంది. 2020లో అమెరికా అంతర్జాతీయ మత స్వేచ్ఛ రాయబారి శామ్యూల్ డీ బ్రౌన్‌బ్యాక్.. ధర్మశాలలో టిబెటన్ శరణార్థులతో సమావేశమై, ఈ విషయాన్ని పునరుద్ఘాటించారు. అంతేకాదు.. చైనా జోక్యాన్ని ఖండిస్తూ అమెరికా కాంగ్రెస్ 2020లో "టిబెట్ పాలసీ అండ్ సపోర్ట్ యాక్ట్" అనే చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం.. చైనా జోక్యం లేకుండా దలైలామా ఎంపిక జరగాలి. ఒకవేళ ఈ ప్రక్రియలో గనుక చైనా అధికార యంత్రాంగం జోక్యం చేసుకుంటే వాళ్లపై ఆంక్షలు విధించవచ్చు.

# షేక్ హసీనాకు ఆరు నెలల జైలు శిక్ష

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆరు నెలల జైలు శిక్షపడింది. కోర్టు ధిక్కరణ కేసులో బంగ్లా న్యాయస్థానం ఆమెకు ఈ శిక్ష విధించిందని బుధవారం(జులై 2న) అక్కడి మీడియా కథనాలు ఇస్తోంది. గత ఏడాది రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని పదవి కోల్పోయి, దేశం వీడిన షేక్ హసీనా.. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. అయితే.. గత ఏడాది అక్టోబర్‌లో షేక్ హసీనా.. రాజకీయ నాయకుడు షకీల్ అకాండ్ బుల్బుల్ మధ్య జరిగిన ఫోన్ సంభాషణ లీక్ అయ్యింది. అందులో న్యాయవ్యవస్థను బెదిరించేలా ఉన్న వ్యాఖ్యలపై కోర్టు ధిక్కార కేసు నమోదైంది. ఈ వ్యాఖ్యలకుగానూ హసీనాకు ఆరు నెలలు, షకీల్ బుల్బుల్‌కు 2 నెలల జైలు శిక్ష విధిస్తూ జస్టిస్ ఎం.డి. గోలం మోర్టుజా మొజుందర్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం తీర్పు ప్రకటించింది. ఇదిలా ఉంటే.. ఆమెతో పాటు అప్పటి నేతలు, సలహాదారులు, సైనికాధికారులపై నేరారోపణలు నమోదయ్యాయి.



ఢాకా కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ (ICT) ఇప్పటికే ఆమెకు అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఆమెను స్వదేశానికి రప్పించేందుకు యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు 30 శాతం కోటా కొనసాగించాలన్న ప్రభుత్వం నిర్ణయంపై నిరుద్యోగులు కిందటి ఏడాది జూన్‌లో ఆందోళన చేపట్టారు. హైకోర్టు ఈ కోటాను సమర్థిస్తూ తీర్పు ఇవ్వడంతో.. నిరసనలు మరింత ఉధృతమయ్యాయి. సుప్రీంకోర్టు స్టే ఇచ్చినప్పటికీ, నిరసనలు తగ్గలేదు. క్రమంగా ఆ ఆందోళన హింసాత్మకంగా మారింది. ఘర్షణల్లో 300 మందికి పైగా మరణించగా.. వేలాది మందికి గాయాలయ్యాయి. కర్ఫ్యూ, ఇంటర్నెట్ షట్‌డౌన్, సైన్యం మోహరింపు వంటి కఠిన చర్యలు తీసుకున్నా.. పరిస్థితి అదుపులోకి రాలేదు. చివరకు.. షేక్ హసీనా రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఆందోళనలు ప్రధాని నివాసాన్ని తాకడంతో.. ఆమె అక్కడి నుంచి భారత్‌కు వచ్చేశారు. 2024 ఆగస్టు 5న బంగ్లాదేశ్ ప్రధానమంత్రి పదవికి షేక్ హసీనా రాజీనామా చేశారు. ఆమె రాజీనామా అనంతరం, తాత్కాలిక ప్రధానిగా నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ బాధ్యతలు స్వీకరించారు.

## వామ్మో పాము.. విమానంలో కలకలం



ఆస్ట్రేలియాలోని విమానంలో ఓ పాము కలకలం సృష్టించింది. దీంతో ఆ విమానం రెండు గంటలు ఆలస్యంగా టేకాఫ్ అయింది. మెల్‌బోర్న్ ఎయిర్‌పోర్టు నుంచి బ్రిస్బేన్‌కు వెళ్లే విమానంలోకి పాము దూరింది. విTమానంలో ప్రయాణికుల లగేజ్ భద్రపరిచే ప్రాంతంలోకి పాము వెళ్తుండగా సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు స్నేక్ క్యాచర్‌ను రంగంలోకి దించారు. సుమారు అరగంట పాటు శ్రమించి పామును పట్టుకున్నారు. అనంతరం విమానానికి తనిఖీలు నిర్వహించి టేకాఫ్ చేశారు. మొదట పాము విషపూరితమైనదిగా అనుమానించారు.. కానీ పట్టుకున్న తర్వాత అది విషపూరితం కాదని.. అది పసిరిక పాముగా గుర్తించినట్లు స్నేక్ క్యాచర్ తెలిపారు. అధికారుల నుంచి సమాచారం అందగానే అరగంటలో తాను ఎయిర్‌పోర్టుకు చేరుకున్నానని, సెక్యూరిటీ తనిఖీల వద్ద బాగా ఆలస్యం జరిగినట్లు స్నేక్ క్యాచర్ పెల్లీ వెల్లడించాడు.

## బోయింగ్ విమానంలో కుదుపులు

### ప్రయాణికులు హడల్, కడసారి సందేశాలు

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర ఎయిరిండియా విమాన ప్రమాదం ప్రపంచ వ్యాప్తంగా విమాన ప్రయాణీకులను పీడకలలా వెంటాడుతోంది. దీంతో విమానంలో చీమ చిటుక్కుమంటే చాలు ప్రాణభయంతో ఉలిక్కి పడుతున్నారు. తాజాగా జపాన్ ఎయిర్‌లైన్స్ బోయింగ్ 737 విమానంలో ఏర్పడిన సాంకేతిక లోపంతో ప్రయాణీకులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఆ తరువాత ఏం చేశారో తెలుసా? జూన్ 30న షాంఘై పుడాంగ్ విమానాశ్రయం టోక్యో నరిటా విమానాశ్రయానికి బయలుదేరిన విమానంలో ఏం జరిగిందో పదండి తెలుసుకుందాం. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ ప్రకారం జపాన్ ఎయిర్‌లైన్స్ బోయింగ్ 737 విమానం 36వేల అడుగుల ఎత్తులో శరవేగంగా దూసుకుపోతోంది. 191 మంది ప్రయాణికులతో ఈ విమానం చైనాలోని షాంఘై నుండి జపాన్ రాజధాని నగరం టోక్యోకు వెళుతోంది. సీట్లలో అలా కూర్చుని, సీట్ బెల్ట్ తీసి అలా రిలాక్స్ అవుతున్నారో లేదో ఒక్కసారిగా కలకలం రేగింది. విమానం యాంత్రిక సమస్యను ఎదుర్కొంది. ఫలితంగా 10 నిమిషాల్లోపు దాదాపు 36,000 అడుగుల నుండి 10,500 అడుగుల కంటే తక్కువ ఎత్తుకు దిగిపోయింది విమానం. క్యాబిన్‌లో ఒత్తిడి తగ్గడంతో, ఫ్లైట్ అటెండెంట్స్ మాస్కులు ధరించాలనే సూచనలు అందించారు. ఆక్సిజన్ మాస్కులు ధరించిన ప్రయాణికుల వణికిపోయారు. విమానం కూలిపోతోందనే భయంతో హడలిపోయారు. నిద్రలో ఉన్న ఒక్క



కుదుపుతో మేల్కొన్నారు. మరికొందరు ప్రయాణికులు వీడ్కోలు సందేశాలు రాయడం మొదలు పెట్టారు. బ్యాంక్ పిన్‌లు ,బీమా సమాచారం వంటి వ్యక్తిగత వివరాలతో ప్రియమైనవారికి సందేశాలు పంపడం ప్రారంభించారు. మరోవైపు ఈ పరిణామంతో పైలట్ అత్యవసర పరిస్థితిని ప్రకటించి విమానాన్ని ఒసాకాలోని కాన్సాయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. పైలట్ చాకచక్యంగా విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేయడంతో ప్రయాణీకులంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా గత నెలలో, అహ్మదాబాద్‌లండన్ మార్గంలో బోయింగ్ విమానం జరిగిన వినాశకరమైన ప్రమాదంలో 275 మంది మరణించారు. అప్పటి నుండి, బోయింగ్ విమానాలతో సంబంధం ఉన్న అనేక ప్రమాదాలు, తయారీదారు భద్రతా వ్యవస్థపై అనేక అనుమానాలు తలెత్తుతున్న సంగతి తెలిసిందే.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సిని... | MOVIE NEWS | గురువారం, హైదరాబాద్ | 03-07-2025
ANN తెలుగు

# అల్లు అర్జున్- ప్రశాంత్ నీల్ కాంబో సెట్ చేసిన దిల్ రాజు..



పుష్ప 2 ఆల్ ఇండియా బ్లాక్ బస్టర్ అయిన తరువాత, అల్లు అర్జున్ తదుపరి ప్రాజెక్టులు పట్ల అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ తో ఫాంటసీ మూవీ చేయాల్సి ఉండగా, అది జూనియర్ ఎన్టీఆర్ ఖాతాలోకి వెళ్లింది. ఇక సందీప్ రెడ్డి వంగాతో బన్నీ ఓ సినిమా చేయనున్నట్టు సమాచారం. కట్ చేస్తే తమ్ముడు ప్రమోషన్లలో భాగంగా దిల్ రాజు బన్నీతో "రావణం" అనే ప్యాన్‌వరల్డ్ మూవీ గురించి చూచాయిగా చెప్పడంతో ఈ ప్రాజెక్టు పట్ల అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. అయితే, ఈ నిర్మాణానికి ఇంకా కొన్ని సంవత్సరాలు పట్టే అవకాశం ఉంది.

ఎందుకంటే, దర్శకుడు ప్రశాంత్ నీల్.. జూనియర్ ఎన్టీఆర్ "డ్రాగన్" సినిమాని 2026 సమ్మర్ వరకు పూర్తి చేస్తాడు. ఆ తర్వాత ప్రభాస్‌తో 'సలార్ 2' తీస్తారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయ్యాకే 'రావణం' సెట్స్ మీదికి వెళ్తుంది' అని తాజాగా చెప్పుకొచ్చారు దిల్ రాజు. అంటే దాదాపు 2028లోనే ఈ మూవీ మొదలయ్యే అవకాశం ఉంటుంది. దీని నిర్మాణం ఒక సంవత్సరం పైగా పడుతుంది. దిల్ రాజు గతంలో కూడా ప్రశాంత్ నీల్ తో జతకట్టే విషయం గురించి మాట్లాడినప్పటికీ, హీరో గురించి స్పష్టత ఇవ్వలేదు. కాని చూస్తుంటే 2028లో బన్నీ ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్‌ని సెట్స్ పైకి తీసుకెళ్లే అవకాశం ఉంది

మైథాలజీ టచ్ తో ఈ సినిమా ఉంటుందని అంతర్గత సమాచారం ప్రకారం. చూడాలి మరి రానున్న రోజులలో ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ఇంకెన్ని వార్తలు వస్తాయి అనేది. ఇక దిల్ రాజు నిర్మాతగా నితిన్ హీరోగా తెరకెక్కిన 'తమ్ముడు' సినిమా శుక్రవారం రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలోనే దిల్ రాజు వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఆయన రానున్న రోజులలో విజయ్ దేవరకొండతో ఓ చిత్రం చేయనున్నాడు. అలానే నితిన్‌తో ఓ ప్రాజెక్ట్ చేయబోతున్నాడు. ఓ వెబ్ సిరీస్ కూడా ప్లాన్ చేస్తున్నాడు. ఈ సారి పక్కా ప్లానింగ్‌తో వైవిధ్యమైన చిత్రాలని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాడు.



# అల్లు అర్జున్ స్టార్‌డమ్‌ని మరెవరూ టచ్ చేయలేరు..

పుష్ప 2 సినిమా అల్లు అర్జున్(Allu Arjun) స్టార్‌డమ్‌ని ఆకాశానికి చేర్చిందనేది తెలిసిందే. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అనేక మంది టాప్ స్టార్స్ ఉండగా ఒక్కసారిగా వీరందరినీ మన బన్నీ దాటేశాడు. తన తదుపరి సినిమాకి ఏకంగా రూ.300కోట్ల రెమ్యునరేషన్ అందుకుంటున్నాడనే వార్త టాప్ బాలీవుడ్ స్టార్స్‌కి కూడా దిమ్మదిరిగిపోయేలా షాక్ ఇచ్చింది. ఓ వైపు ఎంతో కాలంగా ఇంటర్నేషనల్ స్టార్స్‌గా వెలుగొందుతున్న ఎందరో బాలీవుడ్ హీరోలు, మరోవైపు ఇటీవలే గ్లోబల్ స్టార్స్‌గా మారిన దక్షిణాది హీరోలు.. మరి వీరందరిలో భవిష్యత్తులో బన్నీని బీట్ చేయగల హీరో ఎవరు? అనే ప్రశ్నలు చర్చలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే అల్లు అర్జున్ స్టార్‌డమ్‌ని బీట్ చేయడం ఇప్పట్లో మరెవరికీ సాధ్యం కాదు ఓ టాప్ డైరెక్టర్ తేల్చేయడం విశేషం. ఆయన కూడా సాదా సీదా హిందీ సినిమాల దర్శకుడేమీ కాదు అనేక హిట్ చిత్రాలు అందించిన అగ్రగామి బాలీవుడ్ దర్శకుడు మధర్ భండార్కర్(Madhur Bhandarkar). తాజాగా ఆయన మాట్లాడుతూ ఈ అభిప్రాయం వ్యక్తం చేయడం సంచలనంగా మారింది. "సమీప రోజుల్లో, ఎవ్వరూ కూడా అల్లూ అర్జున్ దక్కించుకున్న క్రేజ్‌ను కనీసం తాకలేరు. ఆయన నిజమైన పాన్‌ఇండియా స్టార్" అని మధుర్ భండార్కర్ అన్నారు. అంతేకాదు.. పుష్ప సినిమా కోసం అల్లు అర్జున్ ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేసిన తీరు.

ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ భారీగా మాస్ ఆకర్షణను సంపాదించిపెట్టిందని ప్రాంతాలకతీతంగా అల్లు అర్జున్‌ను ప్రేక్షకులతో కనెక్ట్ చేసిందని ఆయన అభిప్రాయపడ్డారు. పుష్ప సినిమా విజయం గతంగా మారిపోయినా ఇప్పటికీ అల్లు అర్జున్‌ను ప్రశంసిస్తున్న వారి జాబితా అంతకంతకూ పెరిగిపోతుండడం విశేషం. బన్నీని ఆకాశానికి ఎత్తేస్తున్న బాలీవుడ్ ప్రముఖుల్లో మధుర్ భండార్కర్ మాత్రమే కాదు అల్లు అర్జున్ మాత్రమే పుష్ప చేగలడంటూ బాలీవుడ్ టాప్ హీరో హృతిక్ రోషన్ అన్నాడు. అతని ఎనర్జీ ఎక్స్‌ట్రార్డినరీ అంటూ యువ హీరో కార్తీక్ ఆర్యన్ పొగిడితే... ఐకాన్‌స్టార్‌తో ఒక్కసినిమాలో అయినా నటించాలని ఉందని బాలీవుడ్ నటి అనన్య పాండే తపిస్తున్నారు. అతని లాంటి డ్యాన్సర్‌ని చూడలేదని టాప్ కొరియోగ్రాఫర్ ఫరాఖాన్ తేల్చేశారు. ఆయన ఎనర్జీ మరెవరికీ సాధ్యం కాదు అని బాలీవుడ్‌లో ఎనర్జిటిక్ హీరోగా పేరున్న షాహిద్ కపూర్ ఒప్పేసుకున్నాడు. అతనో స్టైల్ ఐకాన్ అంటూ మరో బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్‌లు... అభివర్ణించాడు. ఇలా ఎందరో బన్నీపై భారీ స్థాయిలో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. త్వరలో షూటింగ్ ప్రారంభం కానున్న అల్లు అర్జున్ అట్లీల సినిమా పై అంచనాలను వీరి అభిప్రాయాలు మరింతగా పెంచేస్తున్నాయనేది నిజం. ఈ నేపథ్యంలో ఆ స్థాయి అంచనాలను అందుకోవడానికి బన్నీ అట్లీ ద్యయం మరింతగా కృషి చేయకతప్పదు.



# ఒంటరిగా ఉండలేను.. ఐశ్వర్య సలహానే పాటిస్తున్నా : అభిషేక్

తనపై వచ్చే నెగెటివిటీని ఎదుర్కోవడానికి భార్య ఐశ్వర్య ఇచ్చే సలహాను పాటిస్తున్నానని చెప్పారు బాలీవుడ్ హీరో అభిషేక్ బచ్చన్. ఆమె ఇచ్చిన సలహాతో ఇప్పుడు పాజిటివ్ విషయాలపై మాత్రమే దృష్టిపెడుతున్నానని అన్నారు. తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. నటుడిగా తనపై వచ్చే ఫేక్ న్యూస్, ట్రోలింగ్‌ని ఎలా ఎదుర్కొంటున్నాడో వివరించాడు. 'నా చుట్టు ఉన్నవారిని సంతోషంగా ఉంచాలని నేను ఎప్పుడూ కోరుకుంటాను. అలా చేయడానికి ప్రయత్నిస్తాను. కానీ కొన్నిసార్లు కాలమే మనకు కఠినంగా ఉండమని చెబుతుంది. ఒక నటుడిగా అలా ఉండడం నాకు కుదరదు. అలా ఉంటే ఆ ప్రభావం నా కెరీర్‌పై పడుతుంది. ఎన్ని విమర్శలు వచ్చినా సరే నలుగురిని సంతోషంగా ఉండేలా చేయాలనే మనస్తత్వం నాది. నెగెటివ్ విషయాలు చెప్పే వారి గురించి ఎక్కువగా ఆలోచించేవాడిని, ట్రోలింగ్‌పై కూడా దృష్టిపెట్టేవాడిని.

కానీ నా భార్య ఇచ్చిన ఒక సలహాతో వాటిని దూరం పెట్టేశాను. 'తప్పుడు వార్తలు మనపై ఎలాంటి ప్రభావం చూపవు. పాజిటివ్ విషయాలపై మాత్రమే దృష్టిపెట్టండి. దానివల్ల చాలా ఉపయోగం ఉంటుంది' అని ఐశ్వర్య నాకు సలహా ఇచ్చింది. ఇప్పుడు అదే నేను ఫాలో అవుతున్నాను. ట్రోలింగ్‌ని పట్టించుకోకుండా ఎంజాయ్ చేస్తున్నాను. ఒంటరిగా ఎక్కువ రోజులు ఉండడం నా వల్ల కాదు. కుటుంబాన్ని చూడకుండా ఉండలేను. నా పక్కన మాట్లాడడానికి ఒక మనిషి కచ్చితంగా ఉండాలి. ఇంట్లో అందరం కలిసి సరదాగా మాట్లాడుకుంటాం. వర్క్ బిజీగా గడుపుతున్నప్పటికీ అప్పుడప్పుడు మనకోసం కూడా సమయం కేటాయించుకోవాలి' అని అభిషేక్ అన్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం ఆయన కాళిధర్ లాపత మూవీ ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాడు. జీ 5' వేదికగా జులై 4 నుంచి ఇది అందుబాటులోకి రానుంది.



# సహజత్వానికి చిరునామా సాయి పల్లవి

మనిషి అన్నాక కాస్త కళాపోషణ ఉండాలి అన్నది నానుడి. అలా నటి అన్న తరువాత కాస్త గ్లామర్ అవసరం అన్నది సినిమా వాళ్ల మాట. అందుకే అందాలారబోతకు దూరంగా ఉన్న వాళ్లు కూడా ఇప్పుడు అందుకు సిద్ధం అంటున్నారు. అయితే ఎలాంటి గ్లామర్ అవసరం లేకుండానే పాన్ ఇండియా స్టార్ అయిన కథానాయకి ఎవరైనా ఉన్నారంటే అది నటి సాయిపల్లవినే అవుతారు. డాక్టర్ అయ్యి యాక్టర్ అయిన అరుదైన తారలలో ఈమె ఒకరు. సాయిపల్లవి మంచి డాన్సర్. తద్వారా కలిగిన ఆసక్తినే సినిమా. తొలి రోజుల్లో చిన్న చిన్న పాత్రలో నటించిన సాయిపల్లవి ప్రేమమ్ అనే మలయాళ చిత్రం ద్వారా కథానాయకిగా పరిచయం అయ్యారు. ఆ చిత్రం ఏ ముహూర్తాన విడుదలై సంచలన విజయం సాధించిందో గానీ, ఆ తరువాత తెలుగు, తమిళం భాషల్లోనూ వరుసగా అవకాశాలు తలుపు తట్టాయి.

అయితే తెలుగులో మంచి విజయాలను అందుకుంటున్న సాయిపల్లవికి అక్కడ ఫ్లాప్‌ల సంఖ్య చాలా తక్కువే. అదే విధంగా ఫ్లాప్ అయిన చిత్రాలలోనూ తన నటనకు మంచి మార్కులు పడటం అనేది అరుదైన విషయమే. అందుకు కారణం పాత్రల విషయంలో సాయిపల్లవి చూపే ప్రత్యేక శ్రద్దనే అని చెప్పవచ్చు. తనకు నచ్చిన బాటలో పయనిస్తున్న ఈమె అందంపై కాకుండా అభినయనానికి ప్రాముఖ్యనిస్తున్నారు. అలా సహజ నటిగా పేరు తెచ్చుకున్న సాయిపల్లవి ఇప్పటి వరకూ గ్లామరస్ పాత్రల్లో నటించిందే లేదు. అలా ఆమె సహజత్వానికి చిరునామాగా ముద్ర వేసుకున్నారు. ఇటీవల తమిళంలో అమరన్ చిత్రంలో నటించి అందరి అభినందనలను అందుకున్న సాయిపల్లవి, తెలుగులో నాగచైతన్యకు జంటగా నటించిన తండేల్ చిత్రంలోనూ నటనలో తనదైన ముద్ర వేసుకున్నారు. ఎన్ని చిత్రాల్లో నటించామన్నది కాకుండా ఎన్ని మంచి చిత్రాల్లో నటించామన్నదే ముఖ్యం అని భావించే సాయిపల్లవి ప్రస్తుతం బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చారు. అక్కడ రామాయణం అనే రెండు భాగాలుగా తెరకెక్కుతున్న భారతీయ ఇతిహాస గాథలో సీతగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆమె నటన ఎంతగా ఆకట్టుకుంటుందోన్న ఆసక్తి ఇప్పుడు సినీ ప్రేమికుల్లో నెలకొంది.



# అఖండ 2లో 'భజరంగీ భాయిజాన్' నటి

సల్మాన్ ఖాన్ 'భజరంగీ భాయిజాన్' సినిమాలో మున్నీగా తన నటనతో యావత్ దేశాన్ని ఆకట్టుకున్న హర్షా లీ మల్హోత్రా ఇప్పుడు ఒక బంపర్ ఆఫర్‌ను దక్కించుకుంది! నందమూరి బాలకృష్ణ హీరోగా తెరకెక్కుతున్న 'అఖండ 2' చిత్రంలో ఈ యువ నటి కీలక పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాలో హర్షా లీ 'జనని' అనే పాత్రలో నటిస్తుందని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాతో ఆమె టాలీవుడ్‌లోకి అడుగుపెడుతుండటం విశేషం.

'భజరంగీ భాయిజాన్' తర్వాత చాలా కాలం సినిమాలకు దూరంగా ఉన్న హర్షా లీ, ఇప్పుడు బాలకృష్ణ లాంటి స్టార్ హీరో సినిమాతో తిరిగి రావటం, అది కూడా తెలుగులో డెబ్యూ చేయటం ఆమె అభిమానులకు సంతోషాన్ని కలిగిస్తోంది. 'అఖండ 2'లో ఆమె పాత్ర ఎలా ఉండబోతోంది, బాలకృష్ణతో ఆమె సీన్స్ ఎలా పండాయో చూడటానికి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో సంయుక్తా మీనన్, ఆది కీలక పాత్రల్లో నటిస్తున్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే సినిమా నుంచి టీజర్‌ను విడుదల చేయగా.. రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com